TGTEL/26/A0320

# భారతీయ వెలుగు

జాతీయ తెలుగు దిన పత్రిక

గురువారం జనవరి 29, 2026 | సంపుటి :01 | సంచిక :14 | రంగారెడ్డి | గున్నాల లావణ్య | పేజీలు -12 | వెల-5

Hyderabad,KarimNagar, Warangal, Khammam, Nalgonda, Mahabub Nagar, Nizamabad, Gadwal, Medak, Vikarabad, Wanaparthy, Siddipet,




# దేశానికే రోల్‌మోడల్‌గా డిజాస్టర్ మేనేజిమెంట్



- రూ.100 కోట్లతో అత్యాధునిక పరికరాలు
- రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ శిక్షణా కేంద్రం
- క్షేత్రస్థాయి వరకు అడ్వాన్స్‌డ్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు
- రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రకృతి విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కొని వీలైనంతవరకూ ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా రాష్ట్రంలో ప్రకృతి విపత్తుల నిర్వహణా సంస్థ విభాగాన్ని బలోపేతం చేసి దేశానికి ఒక రోల్ మోడల్‌గా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

పేజి 2లో



## మహారాష్ట్ర రాజకీయాల్లో తీరని విషాదం

- విమాన ప్రమాదంతో డిప్యూటి సిఎం అజిత్ పవార్ దుర్మరణం
- పవార్‌తో పాటు ఇద్దరు సహాయకులు, ఇద్దరు పైలెట్లు మృతి



మహారాష్ట్ర రాజకీయాల్లో తీరని విషాద ఘటన చోటు చేసుకుంది. ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ అనంతరావు పవార్ బుధవారం బారామతి దగ్గర చార్టర్డ్ విమానం కూలిపోవడంతో దుర్మరణం చెందారు. ఈ ఘటనలో ఆయనతోపాటు విమానంలో ఉన్న మరో నలుగురు కూడా ప్రాణాలు కోల్పోయారు. ముంబై నుంచి బారామతి వెళ్తున్న ఈ ప్రైవేట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఉదయం 8:45 గంటల సమయంలో క్రాష్ అయినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. అజిత్ పవార్ వయసు 66 సంవత్సరాలు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ప్రయాణిస్తోన్న విమానం బారామతిలో ల్యాండ్ అయ్యే సమయంలో కుప్పకూలినట్టు తెలుస్తోంది. కూలిన వెంటనే విమానం నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.

పేజి 2లో

## అనర్హత పిటిషన్‌ను కొట్టివేయాలి: స్పీకర్‌కు దానం నాగేందర్ వినతి



2లో

## అమెజాన్‌లో 16వేల మంది ఉద్యోగులు తొలగింపు



2లో

## కల్తీ నెయ్యిపై జగన్ బుకాయింపు

- నిజనిర్ధారణ జరిగాక కూడా తప్పుదోవ పట్టించే ప్రకటనలు
- సహచర మంత్రులతో సంభాషణలో లోకేశ్ ఆగ్రహం



మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మహాపాపం చేసి కూడా బుకాయించు కోవటం జగన్ కే చెల్లిందంటూ వ్యాఖ్యలు చేశారు. కేబినేట్‌కు ముందు ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రులతో లోకేశ్ అల్పాహార విందు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి అంశాన్ని ప్రస్తావించారు. పవిత్రమైన తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందని నిర్ధారణ అయ్యాక కూడా నివేదికను వక్రీకరిస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని జగన్‌పై ఫైర్ అయ్యారు.

పేజి 2లో

## రాష్టంలో మరో కుంభకోణాన్ని బయటపెడుతున్నా..: హరీశ్‌రావు



హైదరాబాద్: రాష్ట్రంలో మరో అవినీతి కుంభకోణాన్ని బయటపెడుతున్నట్లు మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తెలిపారు. ఎక్సైజ్ శాఖలో కొత్తగా మైక్రో బేవరేజెస్‌కు అనుమతులు ఇస్తున్నారని విమర్శించారు. "110 దరఖాస్తుల్లో 25కు అనుమతి ఇవ్వాలని నిర్ణయించారు. కొత్త అనుమతుల్లో ముఖ్య నేత కోటా 21, మంత్రి కోటా 4" అని హరీశ్ రావు ఆరోపించారు.

## మేడారం జాతరలో జనసందడి

- గద్దెలకు అమ్మవార్లు చేరుకునే సమయం ఆసన్నం
- భారీగా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం



ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా, తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతర మొదలయ్యింది. లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. సాయంత్రం కన్నెపల్లి నుంచి సారలమ్మ అమ్మవారు మేడారం గద్దెపైకి రానున్నారు. కన్నెపల్లిలోని సారలమ్మ మందిరంలో కోయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం భారీ భద్రత మధ్య సారలమ్మ గద్దెకు చేరుకుంటారు. గోవింద రాజు, పగిడిద్ద రాజులు కూడా గద్దెలకు చేరుకుంటారు. అలాగే గురువారం సాయంత్రం చిలకలగుట్ట నుంచి సమ్మక్క అమ్మవారు గద్దెపైకి వస్తారు. సమ్మక్క రాకతో జాతర పరిపూర్ణం కానుంది. మరుసటి రోజు అనగా శుక్రవారం(జనవరి 30) భక్తులు సమ్మక్క - సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు.

పేజి 2లో

## పిఠాపురం రైల్వే స్టేషన్‌ను మోడల్‌గా అభివృద్ధి

- పిఠాపురం నుంచి కాకినాడకు నేరుగా రైలు
- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరిన డిప్యూటి సిఎం పవన్

ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన పిఠాపురం రైల్వే స్టేషన్‌ను మోడల్ రైల్వే స్టేషన్‌గా అభివృద్ధి చేయాలని పవన్ విజ్ఞప్తి చేశారు. శక్తిపీఠం, పాదగయ, శ్రీపాద వల్లభస్వామి ఆలయాలు ఉన్న ఈ పట్టణానికి తగిన మౌలిక వసతులు, ఆధునిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా కేంద్ర రైల్వే, సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్‌తో పవన్ సమావేశమయ్యారు. పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అనేక కీలక అంశాలపై ఈ సమావేశంలో వినతిపత్రం సమర్పించారు. పిఠాపురం నుంచి కాకినాడకు నేరుగా రైలు కనెక్టివిటీ ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం సామర్లకోట మీదుగా వెళ్లాల్సి ఉండటంతో ప్రయాణికులు, సరుకు రవాణాకు ఎక్కువ సమయం పడుతోందని, అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని కేంద్రమంత్రికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. పీఎం గతి శక్తి పథకం కింద పిఠాపురం పరిధిలో సామర్లకోట - ఉప్పాడ రోడ్డుపై రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం త్వరగా చేపట్టాలని కోరిన పవన్.. ఇది ట్రాఫిక్ సమస్యలను తగ్గిస్తుందని అన్నారు. జాతీయ రైల్వే ప్రణాళిక - 2030లోని మాన్యువల్ లెవల్ క్రాసింగ్‌లను తొలగించాలనే లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుందని పవన్ వివరించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా పవన్ కళ్యాణ్ మరికొంత మంది కేంద్రమంత్రులతో భేటీ అవనున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పవన్ సమావేశమవుతారు. అలాగే కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో డిప్యూటీ సీఎం భేటీ అవనున్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని ఈ సందర్భంగా కేంద్రమంత్రులను ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కోరనున్నట్లు తెలుస్తోంది.





# సంపాదకీయం

## ఆదివాసీల అస్తిత్వ పతాక 'మేడారం'

మేడారం జాతరను ఎన్నిసార్లు చూసినా, అక్కడి ఆదివాసీ సంప్రదాయాలతో ఎన్నిసార్లు



సహానుభూతి చెందినా తనివి తీరదు. ప్రతీసారి ఏదో ఒక విభిన్నత అనుభవంలోకి వచ్చి భావోద్వేగాన్ని కలిగిస్తుంది. తెలంగాణ నేల స్వభావానికి, సాంస్కృతిక వైభవ పరంపరకు మేడారం నిలువెత్తు ప్రతీక. మూలవాసుల అస్తిత్వానికి పతాక చిహ్నమై, ప్రకృతితో పెనవేసుకున్న వారి ఆచార వ్యవహారాలకు సంకేతమై శరీరాన్ని రోమాంచితం చేస్తుంది. మేడారం జాతర రెండేళ్లకోసారి జరిగే పండుగ మాత్రమే కాదు, అది ఒక జీవన విధానం. ప్రకృతిలోకి ప్రయాణం చేసి పొందే తాదాత్మ్యత. అక్కడేదో మహత్తు ఉంది.

మేడారంలో కొలువైన సమ్మక్క, సారలమ్మలకు సంబంధించి జనశ్రుతుల్లో అనేక గాథలు ప్రచారంలో ఉన్నాయి. వాళ్లు కోయ పాలకులని, కాకతీయులకు సామంతులని, కప్పం కట్టలేక ప్రజల కోసం వారిని ఎదిరించి యుద్ధంలో ప్రాణాలను త్యజించిన వీరులనీ కథనాలు ప్రచారంలో ఉన్నాయి. మరోవైపు వాళ్లు పుట్టు దేవతలని, చల్లని తల్లులని, కోరిన కోర్కెలు తీర్చే దైవాలని ఆదివాసీలు కథలు కథలుగా చెప్పుకుంటారు, తమ ఇలువేల్పులుగా కొలుస్తారు. ఇప్పటికే ప్రాచుర్యంలో ఉన్న కథనాలకు తోడుగా, కాలక్రమంలో అనేక కొత్త కథనాలూ వ్యాఖ్యానాలూ పుట్టుకువస్తున్నాయి.

ఎన్ని ప్రచారాలు, కథనాలు ఉన్నా సమ్మక్క సారలమ్మలు... భక్తకోటి గుండెల్లో దైవాలుగా వెలుగొందుతున్నారు. కోరిన కోర్కెల్ని తీర్చే మహిమాన్విత శక్తులుగా, వీరత్వానికి ప్రతీకలుగా విరాజిల్లుతున్నారు. పోరాటాలకు, ఉద్యమాలకు స్ఫూర్తి ప్రదాతలుగా నిలుస్తున్నారు. మేడారం మొన్నటివరకు కనీసం గ్రామ పంచాయతీ కూడా కాదు. ఊరట్టం అనే పంచాయతీలో ఆవాస గ్రామం. పట్టుమని వెయ్యి మంది జనాభా కూడా లేని ఓ మారుమూల పల్లె. కానీ అక్కడ కొలువైన వనదేవతల మూలంగా ఆ పల్లె రెండేళ్లకోసారి కోటి మందిని తన దగ్గరకు రప్పించుకుంటుంది.

మారుమూలన ఉన్న ఓ వనారణ్యం.. రెండేళ్లకోసారి జనారణ్యమై భాసిల్లడానికి జాతరలోని విభిన్నతే కారణం. స్వచ్ఛమైన ప్రకృతి ఒడిలో ఈ జాతర నాలుగు రోజుల పాటు సాగుతుంది. ఆదివాసీల అరుదైన పూజా విధానాలతో, తీరొక్క మొక్కులతో అబ్బురపరుస్తుంది. గుడి ఉండదు.. గోపురాలు ఉండవు, ధ్వజస్తంభం ఉండదు.. ద్వారపాలకులు ఉండరు, అర్చకులు ఉండరు.. ఆర్జిత సేవలూ ఉండవు. నాలుగు వృత్తాకార గద్దెలపై, నడుమ పాతిన కర్రలే దైవాలకు ప్రతిరూపంగా కనిపిస్తాయి. జాతర వేళ కుంకుమ భరిణెలను ప్రతిష్ఠించినా అవి బయటకు కనిపించవు. మేడారంలో సమ్మక్క, సారలమ్మలు భౌతిక రూపాల్లో దర్శనమివ్వరు. వారు పూర్తి అమూర్తంగా ఉంటారు. జంపన్నవాగులో పుణ్యస్నానం చేసి, గద్దెల వద్దకు వచ్చి 'సల్లంగ సూడు సమ్మక్క తల్లీ..' అని రెండు చేతులెత్తి ప్రార్థించడంతో మొక్కు పూర్తవుతుంది. అక్కడ నిర్వచించలేని ఓ నమ్మకం, విశ్వాసం నిటారుగా నిలబడిన దాఖలా కనిపిస్తుంది. అదొక రహస్య జగత్తు.

జాతర ఆద్యంతం అలుముకునే ఉద్విగ్నత ప్రతీ ఒక్కరిని సమ్మోహనుల్ని చేస్తుంది. నిండు పౌర్ణమి వేళ సమ్మక్క, సారలమ్మ రాక, గద్దెలపై కొలువుదీరే ఘట్టాలు మేడారం అటవీప్రాంతాన్ని భక్తిపారవశ్యపు శిఖరాగ్రాన నిలబెడతాయి. తొలిరోజు కన్నెపల్లి నుంచి సారలమ్మను, రెండోరోజు చిలుకలగుట్ట నుంచి సమ్మక్కను గద్దెలపైకి తీసుకువచ్చే ఘట్టాలను ప్రత్యక్షంగా చూడటం జీవితకాల జ్ఞాపకం. ఈ రెండు ఘట్టాలు సాయంత్రం 5 గంటలకు మొదలై రాత్రి 8 గంటల కల్లా పూర్తవుతాయి. ఆ వ్యవధిలో మేడారం భక్తజన సంద్రమై ఉప్పొంగుతుంది. లక్షలాది కోళ్లూ, యాటలూ తలలు తెంచుకొని తల్లులకు రక్తాభిషేకం చేస్తాయి. శివసత్తులు శిగాలూగుతూ అపర వనదేవతలై వీరంగమాడుతారు. తల్లులను తరలించే ఆదివాసీ వడ్డెలను (పూజారులు) తాకడం కోసం దారిపొడవునా జనం పోటెత్తుతారు. తల్లులు గద్దెలపైకి చేరడంతోనే మేడారం... నిండు పున్నమి వెలుగులో దైవక్షేత్రంగా రూపుదాల్చి జేగీయమానమవుతుంది. మొక్కులు ఊపందుకుంటాయి. తల్లుల చెంతకు భక్తులు వెల్లువెత్తుతారు. ఆ సమయంలో గద్దెల ప్రాంగణమే కాదు, మేడారం యావత్తూ అద్భుతమైన కాంతితో ప్రకాశిస్తూ సంభ్రమాశ్చర్యాలను కలిగిస్తుంది.

ఆదివాసీల పూజావిధానాలు సామాన్యుల జీవన రీతులకు దగ్గరగా, వారి ఆర్థికస్థాయికి తగినట్టుగా ఉంటాయి. అందుకే సమ్మక్క, సారలమ్మలు ఆదివాసులకే కాదు, ఆదివాసీయేతరులకూ ఇష్టదైవాలుగా వెలుగొందుతున్నారు. ఎంతో చవక అయిన బెల్లంను బంగారంగా అప్పగించడం, ఒడి బియ్యం పోయడం, చీరసారెలు సమర్పించడం, ఎదురుకోళ్లను ఎగరేయడం, కోళ్లు, యాటలను బలి ఇవ్వడం.. ఇలా అనేకరకాలుగా మొక్కులు చెల్లించుకుంటారు. ఇతర తీర్థయాత్రలతో పోల్చుకుంటే మేడారం యాత్ర ఖర్చు తక్కువ. అందుకే ఇది సామాన్యుల జాతరగా విలసిల్లుతోంది.

ఆదివాసులకు పండుగలు, జాతరలు అంటే ఒక వినోదం. తమ రోజువారీ జీవితాల నుంచి ఉపశమనం పొందే ఘట్టం. అందుకే మేడారం జాతర విందూవినోదాల సమాగమంగా సాగుతుంది. మందు, మాంసం లేనిదే పూట గడవదు. ఆటపాటలు లేనిదే జాతర ప్రయాణం పరిపూర్ణం కాదు. దేవతల దర్శనానికి ముందూ తర్వాతా జాతరలో భక్తులకు ఎలాంటి కట్టుబాట్లు ఉండవు. నెలసరిలో ఉన్న మహిళలు, అయిన వాళ్లను కోల్పోయి సుష్టలో ఉన్నవారు సైతం దర్శనం చేసుకుంటారు. ముహూర్తాలు, ఘడియలు, వర్జ్యాలు, అమావాస్యలు, వారాలు ఇక్కడ లెక్కలోకి రావు. దేవతలకు, భక్తులకు మధ్య సంధానకర్తలు ఉండరు. ఈ పద్ధతులే సమస్త జనాన్ని సమ్మక్క, సారలమ్మలకు పరమ భక్తులను చేశాయి. ఏపీ, తెలంగాణ నుంచే కాదు, మధ్యప్రదేశ్?, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి కూడా భక్తులు మేడారం బాట పడతారు.

కాలం ఎంత మారుతున్నా, ఆధునికత ఎంత చుట్టుముడుతున్నా మేడారం తన అస్తిత్వ మూలాలను చేజార్చుకోలేదు. బ్రాహ్మణీయ విధానాలను చొప్పించే ప్రయత్నాలు జరిగినప్పుడల్లా ఆదివాసీలు వడిసెల రాళ్లలా ఎదురుదాడికి దిగిన సంఘటనలు ఎన్నో. అభివృద్ధికి, విస్తరణకు సహకరిస్తూనే వారు మేడారం జాతర అస్తిత్వాన్ని కాపాడుకుంటున్నారు. ఒకప్పుడు మేడారం రావాలంటే ఎగుడుదిగుడు మట్టిదారుల్లో ఎడ్లబండ్లే శరణ్యం. గత 30 ఏళ్లుగా ఇక్కడ ఎంతో అభివృద్ధి కనిపిస్తోంది. పాలకులు వందల కోట్లు ఖర్చు చేస్తున్నారు. రోడ్డు రవాణా సౌకర్యాలు ఎంతో మెరుగుపడ్డాయి.

ఈసారి జాతరకు మేడారం కొత్త రూపును సంతరించుకోవడం విశేషం. రూ.101 కోట్ల వ్యయంతో గద్దెలు, గద్దెల ప్రాంగణం చుట్టూ పాలరాతి మహా ద్వారాలను, వృత్తాకార నిర్మాణాలను పాలకులు ఏర్పాటు చేశారు. ద్వారాలపై ఆదివాసీల గొట్టు, గోత్రాలు, వారి ఆచార వ్యవహారాలకు సంబంధించిన చిత్రాలను శిల్పాలుగా చెక్కించారు. మొన్నటివరకు వనదేవతల గద్దెలు ప్రకృతి ఒడిలో సహజసిద్ధంగా కనిపించేవి. ఇప్పుడు పాలరాతి మహాద్వారాలు, వలయాకార నిర్మాణాల మూలంగా అవి మునుపటి ప్రభను కోల్పోయాయనే అభిప్రాయం ఉన్నా, దేవతలపై భక్తులకున్న అపార విశ్వాసం, నమ్మకం ముందు అవేవీ అడ్డంకిగా కనిపించడం లేదు. మేడారం చరిత్రను శాశ్వతం చేసి, జాతర గొప్పతనాన్ని ప్రపంచానికి చాటడం, వనదేవతల దర్శనాన్ని మరింత సులభం చేయడం కోసమే గద్దెల విస్తరణ, అభివృద్ధిని చేపట్టినట్టు ప్రభుత్వం చెబుతున్న వాదనకు మద్దతు బాగానే ఉంది. మేడారంలో చేపట్టిన అభివృద్ధి పనులకు గుర్తుగా తొలిసారిగా వనదేవతల చెంతన క్యాబినెట్? సమావేశం నిర్వహించి ప్రస్తుత ప్రభుత్వం చరిత్ర సృష్టించింది.

మేడారం.. జనాన్నే కాదు, పాలకులను కూడా కదిలించగల అపూర్వ క్షేత్రం. అందుకే భక్తకోటి సేవలో తరించేందుకు ప్రభుత్వ యంత్రాంగమంతా ఇక్కడే మకాం వేస్తుంది. నాలుగు రోజుల పాటు మారుమూల అడవిపల్లె.. మహానగరమై ప్రకాశిస్తుంది.

# దేశానికే రోల్‌మోడల్‌గా డిజాస్టర్ మేనేజిమెంట్



ఎటువంటి విపత్తులనైనా ఎదుర్కొనేలా వంద కోట్ల రూపాయిలతో అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి బుధవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో విపత్తుల నిర్వహణా విభాగం, ﾠ÷ర్ సర్వీసెస్, ఎస్‌డిఆర్‌ఎఫ్, హైడ్రా, ఐ సిసిసి విభాగాలతో సమావేశం నిర్వహించి ఎలాంటి పరికరాలను కొనుగోలు చేయాలన్న విషయంపై సుదీర్ఘంగా చర్చించారు. వరదలు, అగ్నిప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందించడానికి ఖచ్చితమైన సమాచార వ్యవస్థ, రియల్‌టైమ్ మానిటరింగ్ సాధ్యమయ్యేలా విపత్తు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, డ్రోన్లు, శాటిలైట్ ఆధారిత కమ్యూనికేషన్, ఆధునిక రెస్క్యూ పరికరాలు, అత్యాధునిక ÷ర్ / సెర్చ్ ఆపరేషన్ల సాంకేతికతను రెవెన్యూ?విపత్తు నిర్వహణ విభాగాలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి వెల్లడించారు.విపత్తు విభాగంలో పనిచేసేవారికి శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర స్థాయిలో డిజాస్టర్ మేనేజిమెంట్ ఆధ్వర్యంలో అత్యుత్తమ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే వాతావరణ పరిస్థితులు క్షేత్రస్థాయి వరకు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసేలా ఆయా స్ధానిక పరిస్దితులను బట్టి మండల స్థాయి వరకు అడ్వాన్సుడ్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. భారీ వర్షాలు వరదల సమయంలో వాగుల్లో వంకల్లో చెరువుల్లో చిక్కుకున్నవారిని రక్షించడానికి ఎయిర్‌లిఫ్ట్ మెకానిజం తయారు చేసుకోవాలని ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని తరలించడానికి 70 నుంచి 80 కిలోల బరువును ఎత్తే డ్రోన్లను కొనుగోలు చేయాలని సూచించారు. ఎయిర్ లిఫ్ట్ వ్యవస్థ సరిగాలేకపోవడం వల్ల 2024 సంవత్సరంలో నా పాలేరు నియోజవకర్గంలో వాగుల్లో చిక్కుకున్న బాధితులను రక్షించుకోలేక పోయానని ఈ సందర్భంగా మంత్రిగారు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి రాష్ట్రంలో ఏ మారుమూల ప్రాంతంలోనైనా మాట్లాడడానికి వీలుగా సిమ్ ఆధారిత విహెచ్ ఎఫ్ రేడియో సిస్టమ్స్ అందుబాటులోకి తేవాలని సూచించారు. ఇప్పటికే ఈ వ్యవస్థ అందుబాటు లో ఉంది. వ్యవస్‌టను క్షేత్రస్థాయి వరకు తీసుకువెళ్లాలని సూచించారు. అలాగే హైదరాబాద్ నగరంలో హైరైజ్డ్ భవనాలలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని సమర్దవంతంగా ఎదుర్కొనేలా అవసరమైన పరికరాలను కొనుగోలు చేయాలని హైడ్రా కమిషనర్‌కు సూచించారు. 77 హైస్పీడ్ బోట్‌లను కొనుగోలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో 12 ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు ఉన్నాయని, ఒక్కో బృందంలో వెయ్యిమంది వరకు ఉన్నారని వీరందరికీ ఎప్పటికప్పుడు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, అగ్నిమాపకశాఖ డైరెక్టర్ విక్రమాన్ సింగ్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఐసిసిసి డైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనర్హత పిటిషన్‌ను కొట్టివేయాలి: స్పీకర్‌కు దానం నాగేందర్ వినతి

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అఫిడవిట్ దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్న పిటిషన్‌ను కొట్టి వేయాలని స్పీకర్‌కు విన్నవించారు. "నేను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదు. పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు నాకు సమాచారం లేదు. నేను 2024 మార్చిలో కాంగ్రెస్ సమావేశానికి వెళ్లాను. ఆ సమావేశానికి వ్యక్తిగత హోదాలో వెళ్లాను. మీడియా కథనాల ఆధారంగా నేను పార్టీ మారినట్లు బీఆర్ఎస్ భావిస్తోంది. ఆ పార్టీ అనర్హత పిటిషన్‌లోని అంశాలపై మాత్రమే వివరణ ఇస్తున్నాను. గతంలో కోర్టు తీర్పులను అనుసరించి ఆ అనర్హత పిటిషన్ చెల్లుబాటు కాదు. అనర్హత పిటిషన్ తర్వాత పరిణామాలను అనుబంధ సమాచారంగా అంగీకరించవద్దు" అని దానం నాగేందర్ కోరారు. ఈ నెల 30న విచారణకు రావాలని దానం నాగేందర్‌కు స్పీకర్ ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.

## అమెజాన్‌లో 16వేల మంది ఉద్యోగులు తొలగింపు

మొదటి పేజీ తరువాయి

ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ (ూమఝఓశీఅ) మరోసారి భారీ సంఖ్యలో లేఆఫ్ ప్రకటించింది. గతేడాది అక్టోబర్‌లో 14 వేల మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించగా.. తాజాగా 16వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నట్లు పేర్కొంది. ఈ విషయాన్ని సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెత్ గలెటీ అధికారికంగా వెల్లడించారు. 2023 తర్వాత ఈ స్థాయిలో ఉద్యోగులను తొలగించడం ఇదే తొలిసారి. అప్పుడు దాదాపు 27వేల మందికి అమెజాన్ లేఆఫ్‌లు ప్రకటించిన విషయం తెలిసిందే.తొలగింపు ప్రక్రియలో భాగంగా.. కార్పొరేట్ ఉద్యోగుల స్థానంలో జనరేటివ్ ఏఐను వినియోగించే యోచనలో ఉన్నట్లు అమెజాన్ పేర్కొంది. కరోనా సమయంలో తీసుకున్న ఉద్యోగుల సంఖ్యలో భారీగా కోత విధిస్తున్నట్లు తెలిపింది. పలు విభాగాలను తగ్గించి, భాగస్వామ్యం పెంచడం, పాలనా వ్యవస్థలను తొలగించే ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించింది. అయితే, ఏయే విభాగాల్లో ఈ తొలగింపులు ఉంటాయనే విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు.అక్టోబర్‌లో చేపట్టిన సంస్థాగత మార్పులు పూర్తయ్యాయని వెల్లడించిన గలెటీ.. అంతర్గతంగా కొత్త రోల్ వెతుక్కునేందుకు అమెరికా ఉద్యోగులకు 90 రోజుల గడువు ఇస్తున్నామని చెప్పారు. ఆలోగా కొత్త రోల్‌ను ఎంచుకోని వారికి నిబంధనల ప్రకారం ఇతర ప్రయోజనాలు అందిస్తామన్నారు. ఈ మార్పులు చేస్తూనే వ్యూహాత్మక విభాగాల్లో నియామకాలు కొనసాగిస్తామన్నారు.

## మేడారం జాతరలో జనసందడి

మొదటి పేజీ తరువాయి

చివరి రోజైన శనివారంసాయంత్రం సమ్మక్క, సారలమ్మ, గోవింద రాజు, పగిడిద్ద రాజులు వన ప్రవేశం చేస్తారు. దీంతో జాతర పరిపూర్ణంగా ముగుస్తుంది. మేడారం మహా జాతర తెలంగాణ సంస్కృతి, గిరిజన సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. మేడారంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి, వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్నారు భక్తులు. జనాల గుడారాలతో మేడారం కిటకిటలాడుతోంది. భక్తులు బెల్లం(బంగారం) సమర్పిస్తూ ఆచారాలు పాటిస్తున్నారు. మహాజాతరకు ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. దాదాపు మూడు కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా. ప్రభుత్వం తాజాగా గ్దదెలను పునర్నిర్మాణం చేసింది. అలాగే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రవాణా, నీరు, వైద్యం, భద్రతా ఏర్పాట్లు చేశారు.మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర ప్రారంభం కావడంతో ములుగు జిల్లాలోని అడవులన్నీ భక్తజనసంద్రంగా మారాయి. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండగగా పేరొందిన ఈ జాతరలో అత్యంత కీలకమైన ఘట్టం జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించడం. సారలమ్మ గద్దెపైకి వస్తున్న తరుణంలో వేలాది మంది భక్తులు జంపన్న వాగు వద్దకు పోటెత్తడంతో ఆ ప్రాంతమంతా కిటకిటలాడుతోంది. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా భక్తులందరూ బస్సుల ద్వారా, సొంత వాహనాల ద్వారా నేరుగా వాగు వద్దకు చేరుకుని తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. మేడారం వచ్చే ప్రతి భక్తుడు ముందుగా జంపన్న వాగును సందర్శించడం ఒక ఆచారంగా వస్తోంది. ఇక్కడ పుణ్యస్నానం ఆచరించిన తర్వాతే అమ్మవార్ల గద్దెల దర్శనానికి వెళ్లడం సంప్రదాయం. భక్తులు తమ వెంట తెచ్చుకున్న అమ్మవారి ప్రతిమలను వాగులో పవిత్రంగా కడిగి, పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తులు తమ ఇళ్ల వద్ద ప్రతిష్టించుకున్న గద్దెలను మేడారం తీసుకువచ్చి, ఇక్కడ జంపన్నకు మొక్కులు అప్పగిస్తారు. తాము కోరుకున్న కోరికలు నెరవేరినందుకు కృతజ్ఞతగా 'ఎత్తు బంగారం' అంటే తమ బరువుకు సమానమైన బెల్లాన్ని అమ్మవార్లకు సమర్పించేందుకు సిద్ధమవుతారు. ముఖ్యంగా అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన వెదురు లంకలను (ఎదురు కర్రలు) పట్టుకుని భక్తిపాటలు పాడుతూ భక్తులు చేసే సందడి జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

## కల్తీ నెయ్యిపై జగన్ బుకాయింపు

మొదటి పేజీ తరువాయి

పాలే లేని కల్తీ నెయ్యిని సృష్టించి దేవుడి ప్రసాదాన్ని అపవిత్రం చేయటం క్షమించరాని నేరమన్నారు. వందలకోట్ల కుంభకోణానికి పాల్పడటమే కాకుండా అసత్యాలతో ప్రజల్ని తప్పుదోవ పట్టించే యత్నం చేస్తున్నారని మంత్రి విమర్శించారు. వైసీపీ కుట్రలను ధీటుగా తిప్పికొట్టడంతో పాటు వారి భాగోతాన్ని ప్రజల్లోనే ఎండగడదామని మంత్రులతో జరిగిన సమావేశంలో నారా లోకేశ్ సూచించారు.÷ూగా.. తిరుమల శ్రీవారి ప్రసాదమైన లడ్డూ తయారీలో ఉపయోగించిన కల్తీ నెయ్యి కేసులో సీబీఐ ఆధ్వర్యంలోని సిట్ ఇటీవల తుది ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ చార్జ్‌షీట్‌లో 36 మందిని నిందితులుగా చేర్చింది. వీరిలో 12 మంది టీటీడీ ఉద్యోగులు కూడా ఉన్నారు. 2019 నుంచి 2024 వరకు రూ.235 కోట్ల విలువైన 60 లక్షల కిలోల కల్తీ నెయ్యిని తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి ఉపయోగించారని సిట్ దర్యాప్తులో తేలిన సంగతి తెలిసిందే.

## మహారాష్ట్ర రాజకీయాల్లో తీరని విషాదం

మొదటి పేజీ తరువాయి

ఈ ఘటనలో విమానం రెండు ముక్కలైంది. అందులోని వారంత కాలి బూడిదయ్యారు. అజిత్ పవార్.. బారామతిలో బహిరంగ సభకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు సమాచారం. ఘటనాస్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కూలిపోయి అగ్నికి ఆహుతైన విమానంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తోపాటు, మరో ఇద్దరు సిబ్బంది ఒక పీఎస్ఓ, ఒక సహాయకుడు మరో ఇద్దరు పైలట్, కో-పైలట్ మొత్తం ఐదుగురు ఉన్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, విమానంలో ఉన్న ఏ ఒక్కరూ ఈ ప్రమాదం నుండి ప్రాణాలతో బయటపడలేదని డీజీసీఏ అధికారికంగా ప్రకటించింది. అజిత్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అజిత్ పవార్ వర్గం అధ్యక్షులు. మహారాష్ట్రలో అత్యధిక కాలం ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన నాయకుడు. 2024 డిసెంబరు 5 నుంచి దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా ఉన్న మహాయుతి ప్రభుత్వంలో ఏక్‌నాథ్ షిండేతో కలిసి డిప్యూటీ సీఎంగా పనిచేస్తున్నారు. ప్రమాదం వార్త తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి రక్షణ సిబ్బంది, పోలీసులు, ఫైర్ సర్వీస్ బృందాలు చేరుకున్నాయి. డిప్యూటీ సీఎం విమాన ప్రమాదంలో చనిపోయారన్న వార్త తెలిసి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, మరో ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఇతర నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రభుత్వం, ప్రతిపక్షాలు ఈ దుర్ఘటనపై తీవ్ర ఆవేదన, దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాయి. ప్రజలు పెద్ద ఎత్తున ఘటనాస్థలానికి చేరుకున్నారు. బారామతి నియోజకవర్గం నుంచి బలమైన బేస్ ఉన్న అజిత్ పవార్.. శరద్ పవార్ అన్నయ్య కుమారుడు. రాజకీయంగా చాలా శక్తిమంతమైన వ్యక్తిగా ఎదిగారు. ఆయన మరణంతో మహారాష్ట్ర రాజకీయాల్లో భారీ లోటు ఏర్పడిందని పలువురు రాజకీయ ప్రముఖులు చెబుతున్నారు. పవార్ మృతితో మహాయుతి కూటమి, బారామతి ప్రాంతీయ రాజకీయాలపై తీవ్ర ప్రభావం పడనుంది.

## మేడారం భక్తులకు ఇబ్బంది రావద్దు

### అధికారులతో మాట్లాడిన మంత్రి పొంగులేటి



:మేడారం మహాజాతరకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కోటి భక్తుల కొంగు బంగారం, తెలంగాణ కుంభమేళా సమ్మక్క సారలమ్మ మేడారం జాతరలో అత్యంత పవిత్రమైన మొదటి ఘట్టం బుధవారం ప్రారంభమైన నేపథ్యంలో సచివాలయం నుండి హై ఫ్రీక్వెన్సీ వాకీటాకీతో మేడారంలో ట్రాఫిక్ విధులను పర్యవేక్షిస్తున్న సిబ్బందితో మంత్రి మాట్లాడారు. తొలిరోజు కావడంతో భక్తుల సంఖ్య , సారలమ్మ వార్ల రాక ఏర్పాట్లు, సౌకర్యాల కల్పన, జాతరలో నెలకొన్న పరిస్థితులు గురించి మంత్రిగారు ఆరాతీశారు. ప్రజాప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా పోలీసు వ్యవస్థ పటిష్టంగా పనిచేస్తూ, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని, భక్తుల సౌకర్యార్థం తాగునీరు, రవాణా సౌకర్యాలు ఎప్పటికప్పుడు

## బిజెపి జిల్లా అధ్యక్షులు రామచంద్రరావును మర్యాదపూర్వకంగా కలిసిన కంచి మహేందర్...



**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**
రాబోయే స్థానిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో బీజేపీ సీనియర్ నాయకులు కంచి మహేందర్ తన కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో ప్రస్తుత స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత బలోపేతం, కార్యకర్తల సమన్వయం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.
బూత్ స్థాయి నుంచి మండల, డివిజన్ స్థాయి వరకు పార్టీని మరింత పటిష్టం చేయాల్సిన అవసరాన్ని ఇరు నేతలు ప్రస్తావించారు. యువత, మహిళలు, వెనుకబడిన వర్గాల్లో పార్టీ ప్రభావాన్ని పెంచే దిశగా కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్ణయించారు.
ఈ సందర్భంగా కంచి మహేందర్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం అభివృద్ధే బీజేపీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు పార్టీ శ్రేణులు సమిష్టిగా పనిచేస్తే రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని సూచనలు చేశారు.

## పేద మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వైద్య సేవలు అందించాలి....

» వివేకానంద నగర్ లో రాఘవి హాస్పిటల్ ని ప్రారంభించిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**
ప్రైవేటు ఆసుపత్రులు పేద మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మెరుగైన వైద్య సేవలు అందించాలని పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని ఈనాడు కాలనీలో నూతనంగా ఏర్పాటుచేసిన రాఘవే ఆసుపత్రిని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీష్ గౌడ్ తో కలిసి ఆరికెపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నివసించే ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ప్రైవేటు ఆసుపత్రి వర్గాలు ముందుండాలని సూచించారు. ఆస్పత్రి నిర్వాకులు డాక్టర్ అరుణీందర్ రెడ్డి మాట్లాడుతూ చిన్నపిల్లల నుండి మొదలుకొని వృద్ధుల వరకు అన్ని రకాల చికిత్సలు జరిగే విధంగా అదునాతన సౌకర్యాలతో ఆసుపత్రిలో ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. ఆస్పత్రిలో 40 పడకల గదులతో ప్రత్యేకంగా ఎన్ ఐ సి యు, ఐసీయూ సౌకర్యాలతో రూపొందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబాల మహేష్ గౌడ్, బాష్పాక యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## మొదటి ప్రాధాన్యత ఓటుతో మద్దతు ఇవ్వండి : రంగనాథ్.ఆర్

– 30వ తేదీన తెలంగాణ స్టేట్ బార్ కౌన్సిల్ ఎన్నికలు



**భారతీయ వెలుగు శేరిలింగంపల్లి, ప్రతినిధి :**
జనవరి నెల 30వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ స్టేట్ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో
రంగనాథ్.ఆర్ సభ్యుడిగా పోటీ చేస్తున్నారు. 1998లో సీనియర్ న్యాయవాది, సంగారెడ్డి, వికారాబాద్, హైకోర్టులో రంగారెడ్డి జిల్లాలో ప్రాక్టీస్ చేశారు. న్యాయవాదుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, బార్ కౌన్సిల్ అభివృద్ధి కోసం పనిచేసే అవకాశం ఇవ్వాలని,
మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి, తెలంగాణ స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యునిగా ఎన్నుకోవాలని అభ్యర్థించారు.

## చెరుకూరి బిక్షపతి కుటుంబాన్ని పరామర్శించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు...





**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**
కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని సంగీత్ నగర్ కొమ్ము బస్తీకి చెందిన చెరుకూరి బిక్షపతి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి పరమపదించారు. ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు బుధవారం ఉదయం చెరుకూరి బిక్షపతి నివాసానికి వెళ్లి వారి పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు చెరుకూరి బిక్షపతి మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

## మహావీర్ నగర్ కమలమ్మ కాలనీ సమస్యలపై పాదయాత్ర చేసిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్...



**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**
అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మహావీర్ నగర్, కమలమ్మ కాలనీలలోని పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులపై డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.ఎచ్.ఎమ్.సి అధికారులు కాలనీ వాసులతో కలిసి పాదయాత్ర చేసి సమస్యలను పరిశీలించారు.
ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మహావీర్ నగర్, కమలమ్మ కాలనీలలో కొంతమేర డ్రైనేజీ, సీసీ రోడ్లకు సంబందించిన పెండింగ్ వర్క్స్ ఉన్నాయని, వాటిని శేరిలింగంపల్లి శాసనసభ్యులు పి.ఎ.సి చైర్మన్ అరేకపూడి గాంధీ దృష్టికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి శాంక్షన్ చేయించి అతిత్వరలో నిర్మాణ పనులు మొదలుపెడతామని హామీ ఇచ్చారు. కాలనీలలో కొన్నిచోట్ల డామేజ్ అయిన మన్ హోల్ మూతలను వెంటనే మర్చి కొత్తవి అమర్చాలని సంబంధిత అధికారులకు తెలియచేసారు. డివిజన్ సమగ్ర అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అని, దశల వారిగా అభివృద్ధి పనులు చేపడుతామని, కాలనీలో పెండింగ్లో ఉండి అసంపూర్తిగా మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, శివరాజ్ గౌడ్, గోపాల్, పాండుగౌడ్, రాజు పటేల్, హరీష్, వీరేష్, నారాయణ, మల్లేష్, శ్రీను, రాంచందర్, రాఘవయ్య, ఏటీఎం శ్రీను, శివ, ప్రతాప్, డి. రాజు పటేల్, దశరథ్, విజయ్, సురేష్, రవి, ప్రకాష్, లింగం, సుధాకర్, సత్తయ్య, రమేష్, రాజు గౌడ్, రవీందర్, ఖలీమ్.
జి.ఎచ్.ఎమ్.సి అధికారులు ఎస్.ఆర్.పి నాగేశ్వర నాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, యు బి డి నాగరాణి, ఎంటమాలజీ సూపర్వైజర్ డి.నరసింహులు, వాటర్ వర్క్స్ మేనేజర్ శ్రీనివాస్, వాటర్ వర్క్స్ సూపర్వైజర్ శివ, ఎస్.ఎఫ్.ఎ వెంకటరెడ్డి, మల్లేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చదువు వజ్రాయుధం వంటిది

– జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**భారతీయ వెలుగు: వికారాబాద్, జిల్లా ప్రతినిధి, జనవరి:28,**
చదువు వజ్రాయుధం లాంటిదని గుర్తించి విద్యార్థులకు విద్యాబోధన చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. బుధవారం దారూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కాంప్లెక్స్ సమావేశానికి కలెక్టర్ ఆకస్మికంగా వెళ్లి సందర్శించారు. కాంప్లెక్స్ సమావేశంలో పాఠశాలల్లో విద్యా బోధనపై ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ...విద్య ద్వారా మాత్రమే సామాజిక మార్పు వస్తుందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని జవాబు దారితనంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, ఏపీజే అబ్దుల్ కలాం లాంటి మహనీయుల స్ఫూర్తిని విద్యార్థుల్లో కల్పించి విద్య యొక్క ఆవశ్యకత తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు ఆంగ్ల భాష పైన పట్టు సాధించేందుకు సరళంగా అర్థమయ్యే విధంగా విద్యా బోధన చేయాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల్లో భయాన్ని తొలగించి గట్టి నమ్మకాన్ని కలిగించే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దే విధంగా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు చదవడం రాయడమే కాకుండా ఇంగ్లీష్ పదాలను అర్థం చేసుకునే విధంగా తర్ఫీదు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లో కుటుంబ పెద్దగా వ్యవహరిస్తూ ఉపాధ్యాయులందరినీ సమన్వయంతో నడిపిస్తూ ముందుకు సాగాలని కలెక్టర్ పేర్కొన్నారు.పాఠశాలల్లో పారిశుద్ధ్యంకు ప్రాధాన్యత కల్పిస్తూ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా సౌకర్యవంతంగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు ఇంకా మిగిలిపోయిన మరమ్మత్తు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుందామని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలకు వేయించే పెయింటింగ్ దీర్ఘకాలం ఉండే విధంగానాణ్యవంతంగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకా దేవి, మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అంటే భయం... అక్రమ నిర్మాణాలు అంటే ప్రియం..

– జోనల్ కమిషనర్ పై కాంగ్రెస్ నేత యుగంధర్ రెడ్డి ఆగ్రహం





**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**
కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కు కూకట్పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ తీవ్రంగా భయపడుతున్నాడని ఇదే సమయంలో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ఆరోపిస్తూ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అనుమతులకు మించి అదనంగా మూడు అంతస్తులను అక్రమంగా నిర్మించిన విషయమై కూల్చివేయాలని హై కోర్టు ఆదేశాలు ఉన్నా కూడా ఏమాత్రం పట్టించుకోకుండా బాలానగర్ పోలీసులే బందోబస్తుకు పోలీసులను ఇవ్వడం లేదని వాళ్లపైనే చెబుతున్నాడని పేర్కొన్నారు. ఈరోజు కులగొడతా, రేపు కులగోతా అంటూ కలిసిన ప్రతీసారి చెబుతూ కాలయాపన చేస్తున్నాడని పేర్కొన్నారు. నిజం చెప్పాలంటే జోనల్ కమిషనర్ బిఆర్ఎస్ పార్టీకి ఒక ఏజెంటుగా వ్యవహరిస్తున్నాడని, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి కూడా అధికారులు ఇంకా బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, కార్పొరేటర్ కు సంపూర్ణ మద్దతు, సహకారం అందజేస్తున్నాడని పేర్కొన్నారు. హైకోర్టులో కేసు ఉన్నా కూడా జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ఏమాత్రం భయపడటం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అక్రమంగా నిర్మించిన భవనాన్ని తక్షణమే కూల్చివేయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఉన్నా కూడా ఎక్కడా పనులు అవుతలేవని, ఇందుకు కారణం కూకట్పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ కారణమని యుగంధర్ రెడ్డి పేర్కొన్నారు.

## జహీరాబాద్ లో బి ఆర్ ఎస్ అభ్యర్థులు ముగ్గురు బిజెపి అభ్యర్థి ఒకరు నామినేషన్లు వేశారు.





**జహీరాబాద్ భారతీయ వెలుగు ప్రతినిధి జనవరి 28**
జహీరాబాద్ మున్సిపాలిటీలో నాలుగు నామినేషన్లు వేశారు. బుధవారం నాడు మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక కోసంనామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మున్సిపాలిటీలో 37 మంది కౌన్సిలర్ ఎన్నిక అయిన తర్వాత వీరందరూ కలిసి చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక చేయవలసి ఉంటుంది. దీనికోసం బుధవారం నాడు బి ఆర్ ఎస్ పార్టీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు, ఒక బిజెపి పార్టీ అభ్యర్థి కౌన్సిలర్ ఎన్నిక కోసం నా మిషన్ దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఈ మున్సిపాలిటీ ఎన్నికల కోసం వివిధ పార్టీలకు చెందిన నాయకులు బి ఫారం కోసం ఎదురుచూస్తున్నారు. కౌన్సిలర్ల ఎన్నికల కోసం పెద్ద మొత్తంలో కార్యకర్తలు తమకే బీఫార్మన్ ఇయ్యాలంటూ పార్టీ సీనియర్లపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఈ నా మిషన్ జహీరాబాద్ డిఎస్పి సైదా నాయక్ సిఐ శివలింగం ఎస్ ఐ వినయ్ కుమార్లు గట్టి బంధ బస్సులో నిర్వహిస్తున్నారు.

## చేవెళ్ల మున్సిపాలిటీ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జిగా వడ్డేపల్లి రాజేశ్వరరావు...



**భారతీయ వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**
తెలంగాణ రాష్ట్రంలో 116 మున్సిపాలిటీలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో చేవెళ్ల మున్సిపాలిటీ బీజేపీ ఎన్నికల ఇన్?చార్జిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుని పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా బుధవారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని బీజేపీ ఆశావహ అభ్యర్థుల నుండి దరఖాస్తు ఫారాలను వడ్డేపల్లి రాజేశ్వరరావు స్వయంగా పాల్గొని స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దరఖాస్తులు ఇచ్చిన అభ్యర్థులందరూ కూడ గురువారం నామినేషన్లకు సిద్ధంగా ఉండాలని, అదేవిధంగా భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్రంలో ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకుంటూ రోజురోజుకు మరింత బలపడుతోందని, రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రజల మద్దతుతో చేవెళ్ల మున్సిపాలిటీని తప్పకుండా కైవసం చేసుకుంటామని వడ్డేపల్లి ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, పారదర్శక పాలన అందించేందుకు బీజేపీ కట్టుబడి ఉందని, కార్యకర్తల సమిష్టి కృషితో చేవెళ్లలో విజయ పతాకం ఎగురవేస్తామని తెలిపారు.

# యాసంగి సీజన్ లో రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలి.



**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట జనవరి 28**

జమ్మికుంటలో తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము. మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం రైతు భరోసా 15 వేల రూపాయలు తక్షణమే నిధులు విడుదల చేయాలని అన్నారు. పొలాల్లో రైతు చెమట చిందుతోంది కానీ ప్రభుత్వ ఖజానా తలుపులు మాత్రం రైతన్నకు ఇంకా తెరుచుకోలేదు రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. రైతు భరోసా పేరుతో ప్రకటించిన పెట్టుబడి సాయం ఈ సీజన్ లోనూ రైతులకు రైతు భరోసా అందకపోవడం వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది.

పంట కాలం మొదలయ్యే సమయంలో. పెట్టుబడి సాయం అందిస్తేనే ఆ పథకానికి అర్థం ఉంటుంది. కానీ సంక్రాంతి పండుగ దాటినా పెట్టుబడి సాయంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయలేకపోయింది. రేపో మాపో విడుదల అంటూ మాటలకే పరిమితమైన పాలకుల ధోరణి రైతులను అయోమయంలోకి నెట్టుతుంది అన్నారు. రైతులు బ్యాంకులు, ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

గతంలో రైతు బంధు పథకం సీజన్ కు ముందే రైతుల ఖాతాల్లో జమ అయ్యేది. మధ్యవర్తులు లేకుండా, రాజకీయ ప్రచారం లేకుండానే పెట్టుబడి సాయం నేరుగా రైతన్న చేతికి చేరింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు డిక్లరేషన్లో ఇచ్చిన హామీల అమలుపై అనుమానాలు మొదలయ్యాయి. ఎకరానికి ఏటా రూ.15 వేల పెట్టుబడి సాయం హామీ మాటల్లోనే మిగిలి, అమల్లో రూ.12 వేలకే పరిమితమైంది. అదీ సకాలంలో అందకపోవడం వల్ల రైతు భరోసా పథకం పేరుకే పరిమితమవుతోందన్న విమర్శలు బలపడుతున్నాయి. యాసంగి సీజన్లో వరి చివరి దశకు నాట్లు చేరుకున్నాయి.. ఈ కీలక సమయంలో పెట్టుబడి సాయం అందితే రైతుకు ఊరట కలిగేది. కానీ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబించడం వల్ల రైతుల

ఆశలు ఆవిరయ్యాయి. వ్యవసాయం మీద ఆధారపడి జీవించే అన్నదాతను ఇలా అనిశ్చితిలో ఉంచడం సమంజనం కాదు అని. రైతు భరోసా నిధులు విడుదల చేస్తారన్న ప్రచారం జరిగినా, అది కేవలం రాజకీయ లెక్కలకే పరిమితమైందన్న భావన రైతుల్లో పెరుగుతోంది. ఎన్నికల ముందు హామీలు, తర్వాత నిర్లక్ష్యం అన్న దృశ్యం రైతన్నను

మరింత ఆగ్రహానికి గురిచేస్తోంది. రైతు భరోసా పథకం రైతుకు మేలు చేయాలంటే మాటలకన్నా చర్యలు అవసరం. సీజన్ మధ్యలో కాదు, సాగు ప్రారంభంలోనే పెట్టుబడి సాయం అందాలి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతు భరోసాను తక్షణమే విడుదల చేయాలని అన్నారు.

# రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ వార్తను ప్రముఖంగా కవర్ చేయగలరు.

» సురంజన్ వ్యాఖ్యలపై వాసాల రామస్వామి తీవ్ర ఆగ్రహం
» డబ్బు--అధికార రాజకీయాలకు ప్రతీకగా సురంజన్ : వాసాల రామస్వామి
» ఎన్నికల వేళ కండువాలు మార్చే రాజకీయాలకు ప్రజలే తీర్పు చెబుతారు



**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట, జనవరి 28 :**

రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కుతున్న వేళ, "కాంగ్రెస్ పార్టీలో ఆదరణ లేకనే టీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లాను" అంటూ డాక్టర్ సురంజన్ చేసిన వ్యాఖ్యలపై జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వాసాల రామస్వామి తీవ్ర స్థాయిలో స్పందించారు. సురంజన్ వ్యాఖ్యలు పూర్తిగా రాజకీయ లబ్ధి కోసం చేసిన అసత్య ప్రచారమని, ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నమని ఆయన తీవ్రంగా ఖండించారు.

కాంగ్రెస్ పార్టీలో ఆదరణ లేదని చెప్పడం పూర్తిగా అబద్ధమని, కాంగ్రెస్ పార్టీ అనేది సిద్ధాంతాలు, త్యాగాలు, ప్రజా పోరాటాలతో నిర్మితమైన పార్టీ అని వాసాల రామస్వామి స్పష్టం చేశారు. పార్టీలో స్థానం లేకపోవడం వల్ల కాదు, ఎన్నికల సమయంలో డబ్బు, అధికారం ఆశించి రాజకీయ కండువాలు మార్చుకోవడమే సురంజన్ రాజకీయ వ్యూహమని ఆయన విమర్శించారు. నిన్నటిదాకా ఒక పార్టీ, నేడు మరో పార్టీ, రేపు ఇంకొక పార్టీ అంటూ మారడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని అన్నారు.

ప్రజాసేవే లక్ష్యమని చెబుతున్న సురంజన్, వాస్తవానికి ఎన్నికలను పెట్టుబడిగా మార్చుకుని రాజకీయ లాభాలు పొందాలనే ధోరణితో వ్యవహరిస్తున్నాడని వాసాల రామస్వామి ఆరోపించారు. 16వ వార్డు ప్రజలను నమ్మించి మోసం చేసిన చరిత్ర ఉందని, ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల మధ్య కనిపించి, మిగిలిన కాలంలో అధికార, డబ్బు చుట్టూ తిరగడమే అతని రాజకీయ పని విధానమని అన్నారు.

వైద్య వృత్తి లాంటి పవిత్ర సేవలో ఉండి కూడా పేద ప్రజల బాధలను రాజకీయ మెట్లు ఎక్కేందుకు ఉపయోగించుకోవడం అత్యంత హేయమైన చర్య అని వాసాల రామస్వామి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పేదల రక్తంతో సంపాదించిన డబ్బుతో ఎన్నికల్లో గెలవాలన్న దురాశే సురంజన్ రాజకీయాల్లోకి రావడానికి ప్రధాన కారణమని విమర్శించారు. డబ్బు పిచ్చితో అమ్ముడుపోయిన వ్యక్తివి నువ్వని, సిద్ధాంతాలు లేని అవకాశవాద రాజకీయాలకు నువ్వే ప్రత్యక్ష ఉదాహరణని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

కాంగ్రెస్ పార్టీ పేరుతో ప్రజల్లో తిరిగి రాజకీయ గుర్తింపు సంపాదించి, ఎన్నికలు దగ్గరపడగానే పార్టీని వదిలి ఇతర పార్టీల వైపు పరుగులు తీయడం నీ అసలు స్వభావాన్ని బయటపెడుతోందని అన్నారు. సిద్ధాంతాలపై నమ్మకం లేని వ్యక్తులు ప్రజాప్రతినిధులుగా మారితే ప్రజాస్వామ్యానికి ప్రమాదమని హెచ్చరించారు.

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు డబ్బు రాజకీయాలను తిరస్కరించి, ప్రజాసేవకు కట్టుబడిన వారిని మాత్రమే ఆదరిస్తారని వాసాల రామస్వామి విశ్వాసం వ్యక్తం చేశారు. 16వ వార్డు ప్రజలు ఇప్పటికే నీ అసలు స్వరూపాన్ని గుర్తించారని, ఇకపై నీ మాటలకు, నీ ప్రచారానికి ప్రజల్లో విశ్వాసం లేదని స్పష్టం చేశారు.

ఎన్నికల వేళ ప్రజల మధ్య తిరగకుండా, పార్టీలు మారుతూ స్వలాభం చూసుకునే రాజకీయాలకు ఈసారి ప్రజలే తగిన తీర్పు చెబుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, ప్రజల పక్షాన నిలబడి ఈ ఎన్నికల్లో పోరాడుతుందని, అవకాశవాద రాజకీయ శక్తులకు గట్టి రాజకీయ సమాధానం ఇస్తుందని వాసాల రామస్వామి స్పష్టం చేశారు.

# జవహర్ నగర్ జెడ్ పిహెచ్ ఎస్ విద్యార్థిని ఘనత: తైక్వాండో లో అంతర్జాతీయ 'కుక్కివాన్' బ్లాక్ బెల్ట్ సాధించిన జశ్విని

» విద్యార్థులకు ఆత్మరక్షణకు తోడ్పడుతున్న తైక్వాండో శిక్షణ - ప్రధానోపాధ్యాయులు మొహమ్మద్ ఆజామోహియుద్దీన్







**భారతీయ వెలుగు దిన పత్రిక మల్కాజిగిరి మండల ప్రతినిధి**

జవహర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని భూంపాగు జశ్విని క్రీడారంగంలో అద్భుత ప్రతిభ కనబరిచింది. 8వ తరగతి చదువుతున్న జశ్విని, తైక్వాండోలో అత్యంత ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ 'కుక్కివాన్' బ్లాక్ బెల్ట్ సాధించి పాఠశాలకు మరియు తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మొహమ్మద్ ఆజామోహియుద్దీన్ జశ్వినికి బ్లాక్ బెల్ట్ మరియు సర్టిఫికెట్ ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతో పాటు ఆత్మరక్షణ విద్యలైన తైక్వాండో శిక్షణ ఎంతో అవసరమని, ఇది వారిలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. సీనియర్ టీచర్ రాజేందర్ కూడా విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి పూర్తి మద్దతు అందించారు.

– మాస్టర్ రమేష్ పర్యవేక్షణలో విద్యార్థుల నైపుణ్యం– కోచ్ కృషితోనే అంతర్జాతీయ గుర్తింపు

రణ్ వీర్ తైక్వాండో అకాడమీ మాస్టర్ రమేష్ పర్యవేక్షణలో జవహర్ నగర్ విద్యార్థులు తైక్వాండోలో ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. మాస్టర్ రమేష్ అందించిన కఠినమైన శిక్షణ మరియు మెళకువల వల్లే జశ్విని అంతర్జాతీయ స్థాయి కుక్కివాన్ బ్లాక్ బెల్ట్ సాధించగలిగిందని తల్లిదండ్రులు భూంపాగు కృష్ణ, జయంతి హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న మాస్టర్ రమేష్ కృషిని పలువురు అభినందించారు. ఈ చొరవతో విద్యార్థులు ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడమే కాకుండా, భవిష్యత్తులో దేశానికి పేరు తెచ్చే స్థాయికి ఎదగాలని ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు ఆకాంక్షించారు.

# మంత్రి సమక్షంలో జోగిపేట మాజీ కౌన్సిలర్ చేరిక..



**భారతీయ వెలుగు , అందోలు:**

సంగారెడ్డిలోని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖతో పాటు సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి వర్యులు దామోదర్ రాజనర్సింహ సమక్షంలో జోగిపేట మాజీ కౌన్సిలర్ తుపాకుల సునీల్ కుమార్ తన అనుచరులతో కలిసి బుధవారం కాంగ్రెస్ పార్టీలో అధికారికంగా చేరారు. ఈ సందర్భంగా మంత్రి వర్యులు దామోదర్ రాజనర్సింహ మాజీ కౌన్సిలర్ సునీల్ కుమార్ కు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా, కట్టుదిట్టంగా పనిచేయాలని రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయాన్ని సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులంతా సమిష్టిగా కష్టపడి పనిచేస్తూ ప్రజల నమ్మకాన్ని మరింత బలపరచాలని మంత్రి దిశానిర్దేశం చేశారు.

## పటాన్ చెరు రిజిస్ట్రేషన్ ఆఫీస్ శంకుస్థాపన..

–హాజరైన మంత్రులు పొంగులేటి, వివేక్

–ఘన స్వాగతం పలికిన నీలం మధు ముదిరాజ్





**భారతీయ వెలుగు , సంగారెడ్డి ప్రతినిధి:**

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు లోని కర్ధనూర్ లో నూతనంగా నిర్మించతలపెట్టిన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి హాజరయ్యారు. మార్గమధ్యంలోని ఔటర్ రింగ్ రోడ్డు వద్ద మంత్రులిద్దరికి మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ ఘన స్వాగతం పలికారు. ఇద్దరికి పూల బొకేలు అందించి శాలువలతో సత్కరించారు. పటాన్ చెరు కు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మంజూరు చేయడంతో పాటు కర్ధనుర్ లో స్థల కేటాయింపు చేసి భవన నిర్మాణం పనులు మొదలు పెడుతున్నందుకు ఆయన ప్రత్యేక ఆధన్యవాదాలు తెలిపారు. సబ్ రిజిస్టర్ కార్యాలయ ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు ప్రయాణ భారం తగ్గడంతో పాటు సమయం, రవాణా ఖర్చులు కలిసి వస్తాయని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధికి సహకరిస్తున్నందుకు నియోజకవర్గ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# దర్బారులో ఘనంగా కూల్ పుణ్యవచన కార్యక్రమం



**భారతీయ వెలుగు ప్రతినిధి గోదావరిఖని జనవరి 28:**

గోదావరిఖని పట్టణ పరిధిలోని రమేష్ నగర్ సెంటర్, కాకతీయ నగర్ లో ఉన్న హజరత్ తాజుద్దీన్ బాబా దర్బారులో బాబా జన్మదిన వేడుకల సందర్భంగా మూడవరోజు బుధవారం "కూల్" పుణ్యవచన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దర్బార్ నిర్వహకులు నారాదాసు సతీష్ రావు ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో చేపట్టారు.ఈ సందర్భంగా దర్బారులో ఖురాన్ పట్టింపు నిర్వహించగా, భగవద్గీత పారాయణం కూడా చేశారు. అనంతరం భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు తమ మొక్కులను చెల్లించుకొని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కులమతాలకు అతీతంగా ఐక్యతను చాటే విధంగా ఈ వేడుకలు నిర్వహించారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి, సేవాభావాన్ని ప్రతిబింబించారు.

# కింగ్ పవర్ డీజేను ప్రారంభించిన మనాలి ఠాకూర్





**భారతీయ వెలుగు ప్రతినిధి గోదావరిఖని జనవరి 28:**

రామగుండం శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో ప్రముఖ డీజే సంస్థ కింగ్ పవర్ డీజేను ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్, సంస్థ నిర్వాహకుడు తాజ్ కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ మాట్లాడుతూ, యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయడం ఆనందకరమని, ఇటువంటి కార్యక్రమాలు యువతకు ప్రోత్సాహకరమని తెలిపారు. కింగ్ పవర్ డీజే సంస్థ మంచి సేవలతో ఎదగాలని ఆకాంక్షించారు.

# బీఆర్ఎస్ పార్టీలో చేరికలు



**భారతీయ వెలుగు ప్రతినిధి మంథని జనవరి 28**

మంథని మున్సిపల్ పరిధిలోని 9వ వార్డ్ కు చెందిన దాసరి మల్లేష్ పుష్ప,పల్లె బాపు,పుల్ల రాజబాబు,చిప్ప వేణు, దాసరి నరేందర్ లు బీఆర్ఎస్ పార్టీలో చేరారు బుధవారం సాయంత్రం మంథని పట్టణంలోని రాజగృహ లో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ లో చేరారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ వారికి బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

TGTEL/26/A0320
భారతీయ వెలుగు
జాతీయ తెలుగు దిన పత్రిక
గురువారం జనవరి 29, 2026

# పేదోళ్ల గురించి ఆలోచన చేయని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్

- రెండేళ్లు దాటినా కట్టిన ఇండ్లియ్యకుండా ఇందిరమ్మ పత్రాలు ఇస్తుండ్లు
- ఆనాడు బీదోళ్లను ఎంపిక చేస్తే లోకల్ కాదంటూ అడ్డుకున్నరు
- అబద్దాలకు, మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ దుద్దిళ్ల శ్రీధర్
- మంథని మున్సిపల్ దుద్దిళ్ల శ్రీధర్ చేతిలో పెడితే ఆగమై పోతరు
- మంచి అవకాశం వచ్చింది ఆలోచన చేసి మంథనిని రక్షించుకోవాలే
- గరీబోళ్ల భూములు గుంజుకుని అయ్యపేరుతో రింగ్ రోడ్ వేస్తడట
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్





**భారతీయ వెలుగు ప్రతినిధి మంథని జనవరి 28**
40ఏండ్లుగా పేదవర్గాలను వాడుకున్న దుద్దిళ్ల కుటుంబం ఈనాటిని పేదోళ్ల గురించి ఆలోచన చేయడం లేదని, అధికారంలోకి వచ్చి 24నెలలు దాటినా పేదోడి గురించి మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ఆలోచన చేయడం లేదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. బుధవారం మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ ఎస్ ప్రభుత్వ హాయాంలో తాము పోచమ్మవాడలో 92ఇండ్లు నిర్మించామని, కూచిరాజ్ పల్లిలో వందకు పైగా ఇండ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. పోచమ్మవాడలో నిర్మించిన ఇండ్లను పేదవర్గాలకు కేటాయిస్తే ఆనాడు ఎమ్మెల్యేగా ఉన్న దుద్దిళ్ల శ్రీధర్ అనేక అడ్డంకులు పెట్టాడని, లోకల్ వాళ్లు లేరంటూ తన సొంత లెటర్ ప్యాడ్ పై కాంప్లెంట్ చేసినట్లు తెలిపారు. అయినా తాము ఇండ్ల పంపిణీ చేయడా ఎమ్మెల్యే కాంప్లెంట్ తో 17ఇండ్ల పంపిణీ ఆగిపోయాయని తెలిపారు, మంథని ఎమ్మెల్యే అధికారంలోకి వచ్చి 24నెలలు గడుస్తున్నా కట్టి ఉన్న ఇండ్లను పేదలకు ఇవ్వకుండా ఇందిరమ్మ ఇండ్ల పత్రాలు ఇస్తున్నారని ఆయన అన్నారు. 26నెలలు గడిచినా 24ఇండ్లు కట్టియ్యలేదు కానీ ఆనాడు తాము పని చేస్తుంటే కాళ్లలో కట్టెలు పెట్టి అడ్డుకున్నారని,ఇండ్లు కట్టిస్తే ఇండ్లను ఆపే ప్రయత్నం చేసి ప్రజలకు ఇవ్వకుండా కుట్రలు చేశారన్నారు. బొక్కలవాగుపై బ్రిడ్జి కట్టిస్తామంటే ఆపించిండ్లని, కాళేశ్వరం ప్రాజెక్టు పనులను ఆపే ప్రయత్నం చేసిండ్లని ఆయన గుర్తు చేశారు. పోచమ్మవాడకు చెందిన కొట్టె రమేష్ పద్మకు ఇళ్లు లేకపోవడంతో ఆయనకు, రావుల లావణ్య అనే అమ్మాయికి పట్టణంలో వసతులు లేవని వారి పేర్లు పెట్టామని, అలాగే ప్రజాజీవితంలో 30ఏండ్లుగా ఉన్న బీజేపీ నాయకులు కొండపాక సత్యప్రకాశ్ ఈశ్వరమ్మకు ఇళ్లు పెట్టినట్లు ఆయన వివరించారు. ఇలా అనేక మంది పేదలను గుర్తించి జాబితాలో పెట్టామన్నారు. కరోనా విపత్కర పరిస్తితుల్లో అద్దె ఇంట్లో ఉన్నవాళ్లు ఎన్ని ఇబ్బందులు పడ్డారో, ఎంత అవమానాలకు గురయ్యారో అందరికి తెలుసునని, ఈ క్రమంలో తాము ప్రతిపేదవాడికి ఇళ్లు ఉండాలనే ఆలోచన చేశామన్నారు. కానీ పోచమ్మవాడలో మిగిలిన 17ఇండ్లు పంపిణీ చేయని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ తన ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ను రాజభవనంలా తీర్చిదిద్దుకున్నాడని,పక్కనే ఉన్న ప్రభుత్వ భవనాలను కూల్చివేశాడని తెలిపారు.అలాగే మరో రెండుమూడు చోట్లు డూప్లెక్స్ నిర్మాణాలకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, ఇప్పటికే హైదరాబాద్ లో రెండువేల కోట్లు సంపాదించుకున్నాడని ఆరోపించారు. ఇండ్లు లేని పేద వర్గాలను గుర్తించి వారి ఇళ్లు ఇవ్వాలనే ఆలోచన చేయడం తమ తప్పా అని ఆయన ప్రశ్నించారు. ఓట్లు వచ్చినయని ఇందిరమ్మ ఇండ్ల పత్రాలు ఇచ్చిండ్లని, సర్పంచ్ ఎన్నికలు వస్తే గ్రామాల్లో ఇచ్చిండని, మున్సిపల్ ఎన్నికలు అనగానే ఇక్కడ ఇస్తుండని ఎద్దేవా చేశారు.
ఓట్ల కోసం తప్ప ప్రజల కష్టాల గురించి ఆలోచనని వ్యక్తి దుద్దిళ్ల శ్రీధర్ అని అన్నారు. పట్టణ బ్యూటిఫికేషన్ పేరుతో లైట్లు పెడుతున్నారని, అయితే బొక్కలవాగుపై ఒక వంతెనపై లైట్లు పెట్టి మరోవంతెనకు ఇప్పటి వరకు అమర్చలేదన్నారు.కేవలం బీఆర్ ఎస్ పార్టీ వాళ్లు నిర్మించారని లైట్లు పెట్టడం లేదని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అంటే ఇక్కడ బీఆర్ ఎస్ పార్టీ అనవాళ్లు ఉండకూడదనే ఆలోచన చేస్తున్నారని అన్నారు. తాను పదేపదే చెప్తున్నట్లుగానే మళ్లీ మారువేశంలో వస్తాడని, మోసగాడు ఎన్ని వేశాలు వేస్తడో తెలువదని, మోసాలకు అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్ దుద్దిళ్ల శ్రీధర్ అని, దుద్దిళ్లశ్రీధర్ చరిత్ర చెప్పకపోతే చరిత్ర క్షమించదన్నారు. వాస్తవ విషయాలను పత్రికా విలేకరులు సైతం వెలుగులోకి తీసుకురావాలని,పోచమ్మవాడలో 17ఇండ్ల విషయం వెలికితీస్తే ఇప్పటికి 17మంది గరీబులు ఆనందంగా ఉండేవారు కాదా అని ఆయన అన్నారు. దుద్దిళ్ల శ్రీధర్ చేతిలో మున్సపాలిటీని పెడితే ఆగమై పోతరని, ఎమ్మెల్యే మంత్రి కాంగానే నాలుగు ఇండ్లు కూలగొట్టిండ్లని మంథని గ్రామం రక్షించబడాలంటే అభివృద్ధి చెందాలంటే మేధావులు ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓటు అనే పవిత్రమైన ఆయుధాన్ని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. దుద్దిళ్ల కుటుంబం, ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ఓటు అనే ఆయుధాన్ని చాలా చులకనగా చూస్తూ ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తుండ్లన్నారు. ఓటు వచ్చినప్పుడు ఆలోచన చేసి వేయాలని కేసీఆర్ చెప్పినట్లుగా మంథని ప్రజలకు మంచి అవకాశం వచ్చిందని, పట్టణ ప్రజలు ముందుగా చైతన్యవంతులు కావాలన్నారు. ఆనాడు 420హమీలకు చైర్మన్ గా ఉండి యావత్ రాష్ట్రాన్ని వల్లకాడుగా చేసిన ఘనతను ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ కు దక్కిందని, ఎన్నికలు వస్తే అబద్దాలు చెప్పి ఏ విధంగా గెలువాలన్నదే అలవాటు అయిందని, రాష్ట్రంలో కూడా అదే దొంగ హామీలు ఇచ్చి 420హమీలతో గెలిచిండనే విషయాన్ని గమనించాలని, మంథనిలో సైతం ఈనాడు అదే ఆనవాయితీని కొనసాగిస్తుండన్నారు. మంథని అభివృద్ధి పేరుతో గరీబోళ్లు భూములు గుంజుకుని ఎమ్మెల్యే అయ్య పేరున రింగ్ రోడ్ నిర్మిస్తుండని, ఇదెక్కడి న్యాయమనిప్రశ్నించాలన్నారు. ఎన్నికలు వస్తేనే పథకాలు, ప్రజలు గుర్తుకు వస్తాయని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం, దుద్దిళ్ల కుటుంబహాయాంలో మంథని ఎలా ధ్వంసం అయిందో బేరీజు వేసుకుని ఓటు అనే ఆయుధాన్ని సక్రమంగా వినియోగించుకుని మంథని అభివృద్ధికి బాటలు వేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఖనిలో మినీ మేడారం జాతర ప్రారంభం







- ఎటు చూసినా భక్తులతో కిటకిట
- సమ్మక్క సారలమ్మ కు అభిషేక వడిబియ్యంతో ప్రారంభించిన మేడారం కోయ పూజారులు
- పూజలు చేసిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ దంపతులు

**భారతీయ వెలుగు ప్రతినిధి గోదావరిఖని జనవరి 28:**
గోదావరిఖని సమీపాన గోదావరి నది ఒడ్డున 18వ జాతర జరుపుకుంటున్న సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లు కానీ విని ఎరుగని రీతిలో మేడారం జాతరను మరిపించే రీతిలో ఏర్పాటు చేసి భక్తుల రాకకై స్వాగతిస్తుంది ఈ 18వ జాతరకు ఒక ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయడం జరిగింది. ఇప్పటివరకు జరిగిన 17 జాతరలు 1992 నుండి ఫెర్రీ డ్రైవర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతర ఏర్పాటయింది ఆనాటి నుండి రోజురోజుకు బలపరుస్తూ భక్తుల రద్దీ పెరుగుతూ గద్దెల నిర్మాణంలో మార్పులు చేర్పులు జరుగుతూ సమ్మక్క సారలమ్మ జాతర కమిటీ ఒక యుద్ధ ప్రాతిపదికన ప్రతి రెండేళ్లకు ఒకసారి కొనసాగిస్తూనే వస్తుంది ఇటీవల గోదావరి నీరు బ్యాక్ వాటర్ పూర్తి స్థాయిలో నిండి ఈ సమ్మక్క సారలమ్మ గద్దెలన్నీ మునిగిపోయి వంపు ప్రాంతాల గురి కావడంతో ఈ శాశ్వత నూతన నిర్మాణ పనులను చేపట్టాలని ఆ సమవ్వసారుల తల్లులు మా రామగుండం నియోజకవర్గం రాజన్న మన అందరి ప్రియతమ నేత ఠాకూర్ మక్కాన్ సింగ్ ప్రోత్సహించి ఒక్కసారి గద్దెల నిర్మాణం పనులు చూసి ఎలాంటి ఇబ్బందులకు లేకుండా నాకు భక్తుల సౌకర్యాలు కల్పించండి అని సూచించిన ప్రకారంగా వెంటనే నాకు మక్కాన్ సింగ్ స్పందించి సింగరేణి యాజమాన్యంతో నాలుగున్నర కోట్లు ఎన్టిపిసి కార్పొరేషన్ తో మొదలకోట్లు తను స్వయంగా కోటి రూపాయలు ఖర్చు చేసి ఆ తల్లి ని 17 సార్లు కొలిచిన రీతి కంటే ఎక్కువ స్థాయిలో భక్తులకు సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించుకొని మూడున్నర మాసాలు జాతర కమిటీతో సంబంధిత పరిశ్రమల యాజమాన్తో చర్చించి అవిరామ కృషిచేస్తూ 24 గంటలు తాను నిద్రపోకుండా తన అనుచరులను కూడా నిద్రపోనివ్వకుండా సంబంధిత సమస్యలను అలసిపోకుండా పనులు చేయించి ఈనాడు ఉత్తర తెలంగాణ జిల్లాలలోని గోదావరినది ఒడ్డున సమ్మక్క సారలమ్మ జాతర మినీ మేడారంలో వెల్లి విరిసిందని చెప్పుకోవడం హర్షినియం.

# నామినికి ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా చెక్ అందచేత

**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట జనవరి 28**



జమ్మికుంట ఆర్థిక అక్షరాస్యత కేంద్రం వావిలాల సర్పంచ్, బీసీ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా పథకం కింద రూ.2 లక్షల చెక్కును నామినీ సుంకిశాల విజ్జలపెల్లి ధర్మారావు కి అందజేయడం జరిగింది. రిజర్వ్ బ్యాంకు ఆధ్వర్యంలోని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్స్ మరియు బీసీ సహకారంతో సర్పంచ్ చేతుల మీదుగా చెక్కు అందజేశారు. గతంలో విజ్జలపెల్లి లలిత ఖాతాదారుడైన జమ్మికుంట ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ద్వారా కేవలం రూ. 436 ప్రీమియంతో వావిలాల యూనియన్ బ్యాంకులో ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా పథకంలో నమోదు చేయించింది. అనారోగ్య కారణాలతో మాలతీ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే జమ్మికుంట ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సిబ్బంది బీసీ కలిసి ఆ చనిపోయిన వ్యక్తి యొక్క అవసరమైన
పత్రాలను నామినీ ద్వారా బ్యాంకులో సమర్పించారు. దాంతో తక్షణమే నామినీకి రూ.2 లక్షల బీమా మొత్తం మంజూరైంది. ఈ సందర్భంగా నామినీ విజ్జలపెల్లి ధర్మారావు, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లకు, యూనియన్ బ్యాంకు బీసీ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బ్యాంక్ లో వుండే ఇన్సూరెన్స్ చేయించుకొవాలి అని చెప్పడం జరిగింది. ఈ భీమా పథకాలు కుటుంబానికి అనుకోని పరిస్థితుల్లో ఆర్థిక భరోసా కల్పిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వావిలాల యూనియన్ బ్యాంకు సిబంది మరియు బీసీ రాంప్రశాంత్, జమ్మికుంట ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సిబ్బంది పి. మణికంత్, ఏ.పవన్, బీ ప్రసన్న, వావిలాల సర్పంచ్, ఉప సర్పంచ్ గ్రామ కార్యదర్శి గ్రామస్తులు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ ముఖ్య కార్యకర్తలసమావేశం



**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట జనవరి 28**
జమ్మికుంట మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పట్టణ రాజకీయాల్లో కీలక ఘట్టంగా నామినేషన్ల పర్వం ఘనంగా ప్రారంభమైంది. రానున్న మున్సిపల్ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బీజేపీ, జమ్మికుంట పట్టణంలో పూర్తి స్థాయిలో బరిలోకి దిగినట్లు ఈ కార్యక్రమం స్పష్టంగా సూచిస్తోంది.
ఈ సందర్భంగా పట్టణంలోని మొత్తం 30 వార్డులలో భారతీయ జనతా పార్టీ తరపున అభ్యర్థులు అందరూ నామినేషన్లు దాఖలు చేస్తున్నారని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కనుమల్ల విజయ, జమ్మికుంట పట్టణ బీజేపీ అధ్యక్షుడు కొలకాని రాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్ లు తెలిపారు. జమ్మికుంట మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఐక్యంగా పని చేస్తున్నాయని వారు స్పష్టం చేశారు.
వారు మాట్లాడుతూ... గత పాలకుల వైఫల్యాలు, అభివృద్ధి లోపాలను ప్రజల ముందు ఉంచుతూ, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో జరుగుతున్న అభివృద్ధి, రాష్ట్రంలో బీజేపీ చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడం ద్వారా ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. జమ్మికుంట పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సత్తా బీజేపీకే ఉందని అన్నారు.
ఈ నామినేషన్ కార్యక్రమం సందర్భంగా బీజేపీ శ్రేణుల్లో అపూర్వ ఉత్సాహం నెలకొంది. పార్టీ జెండాలు, నినాదాలతో పట్టణం మొత్తం కాషాయ మయంగా మారింది. ప్రతి వార్డులో పార్టీ అభ్యర్థులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని నేతలు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, జమ్మికుంట ఎన్నికల ప్రబారి పుప్పాల రఘు, సహ ప్రబారి దొంతర రమేష్ యాదవ్, ఇల్లందకుంట మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి, సర్పంచ్ దాట్ల వీరస్వామి, ఏబీడీ తిరుపతిరెడ్డి, మట్ట పవన్ రెడ్డి, ఈ.ప్రభాకర్ రావు, కుమార్ తో పాటు పట్టణ, మండల, వార్డు స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
నామినేషన్ల పర్వంతో జమ్మికుంట పట్టణ రాజకీయ వాతావరణం పూర్తిగా వేడెక్కిందని, రానున్న రోజుల్లో ఎన్నికల ప్రచారం మరింత ఉధృతంగా సాగనుందని రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. జమ్మికుంట మున్సిపల్ ఎన్నికలను బీజేపీ అత్యంత గౌరవప్రదంగా తీసుకుని, అధికార పీఠం దిశగా దూసుకెళ్తోందని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

# 20వ వార్డ్ నుంచి ఎస్. కృష్ణారెడ్డి పోటీ..

-మద్దతు తెలిపిన ముఖ్య నాయకులు..యువజన సంఘాలు

**భారతీయ వెలుగు , సంగారెడ్డి ప్రతినిధి:**





మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తుండడంతో సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. కాగా జిల్లాలోని అందోలు-జోగిపేట మున్సిపల్ ఎన్నికలు ఎవరికి అంతుచిక్కని విధంగా రాజకీయ ప్రక్రియ కొనసాగుతుంది. పోటీలో నిలువాలనుకునే అభ్యర్థుల భవితవ్యం రిజర్వేషన్లతో తారుమరైంది. దీంతో ఏమి చేయాలో తెలియక కొంతమంది పోటీదారులు అనుకూలమైన వార్డులను వెతుక్కునే పనిలో నిమగ్నమయ్యారు. ఇదిలా ఉండగా ప్రధాన కాంగ్రెస్, బీఆర్ఎస్, బిజెపి అధినేతలకు తలనొప్పిగా మారింది. గెలుపు గుర్రాల కోసం అన్వేషణ చేస్తూ మంత్రాలు కొనసాగిస్తున్నారు. అందోలు-జోగిపేట మున్సిపాలిటీలు మొత్తం 20 వార్డులు ఉండగా ఇదివరకే కొన్ని వార్డులలో అభ్యర్థులు ఖరారయ్యారు. మరికొన్ని వార్డులలో తమ అభ్యర్థులను నిలబెట్టేందుకు వివిధ రాజకీయ పార్టీల నేతలు బిజీగా మారారు. పట్టణంలోని 20వ వార్డు బోసి జనరల్ రావడంతో ఇక్కడ పోటీ చేసేందుకు హెమహెమీలైన ప్రజా సేవకులు ముందుకు వచ్చారు. ఇందులో ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి సురోత్తం రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసేందుకు ముందు వరుసలో ఉండగా ఆయనకు ప్రజలతోపాటు యువజన సంఘాలు సైతం మద్దతు పలుకాయి. ఇక్కడ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆశీస్సుల కోసం ఆయన ఎదురు చూశారు. కానీ చివరకు మేజర్ గ్రామపంచాయతీ మాజీ చైర్ పర్సన్, న్యాయవాది ఎస్. కృష్ణారెడ్డి వైపు పార్టీ ముగ్గు చూపింది. దీంతో పార్టీ కట్టుబడి ఉన్న సురోత్తంరెడ్డి తాను పోటీ నుంచి విరమించుకుంటూ తన అనుచరులతో కలిసి కృష్ణారెడ్డికి మద్దతు తెలిపారు. దీంతో ఆయన దారిలో మరికొందరు కూడా కృష్ణారెడ్డికి తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ తనకు మద్దతునిస్తున్న అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

# అమ్మవార్లను దర్శించుకున్న సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్



**భారతీయ వెలుగు ప్రతినిధి గోదావరిఖని జనవరి 28:**
గోదావరి నది పరివాహక ప్రాంతం కోల్ బెల్ట్ వంతెన వద్ద జరుగుచున్న శ్రీ సమ్మక్క సారలమ్మ వన దేవతలా జాతరలో అమ్మవార్లను ఆర్జి-1 ఏరియా సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్ సింగరేణి సేవా సమితి సభ్యులందరిని తీసుకొని అమ్మవార్లను దర్శనం చేయించారు. ఈ సందర్భంగా సేవా సభ్యులందరితో కలిసి అమ్మవార్లకు చీర, సారే, గాజులు సమర్పించి కొబ్బరికాయలు కొట్టి అమ్మవార్లను దర్శించుకొని ముడుపులు చెల్లించారు. ఈ సందర్భంగా మేడం మాట్లడుతూ స్థానిక రామగుండం శాసన సభ్యులు ఆదేశానుసారం మున్సిపల్ కార్పోరేషన్, సింగరేణి సంస్థ ఆర్జీ-1 ఏరియా సహాకారము అందించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం భక్తుల సౌకర్యార్థం శ్రీ సమ్మక్క సారలమ్మ వన దేవతల జాతర ప్రాంగణంలో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించడం జరిగినదని తెలిపారు. జాతర కార్యక్రమములో అమ్మవార్ల దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులందరూ తరలిరావాలని తెలిపారు. ఆలాగే అమ్మవార్ల కృపతో ఆర్జీ 1 ఏరియాలోని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా మేడం సేవా సభ్యులందరికీ అమ్మవార్ల ధర్శనం చేయించిన పిదప ప్రతి ఒక్క సేవా మహిళకు గాజులు కొని ఇవ్వడం జరిగినది మరియు అందరికి భోజనాలు కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సెక్రటరి భీనాసింగ్, లేడిస్ క్లబ్ సెక్రటరి శిరీష, స్వరూప, అంజలి, సునీతా, సేవా సభ్యులు సత్యవతి, రమాదేవి, సునీతా, లత, అంజలి, శ్రుతిమ, వనిత, సుజాత అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు.

# నిబంధనల ప్రకారం నామినేషన్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి
- నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను విస్తృతంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్







**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట జనవరి 28**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం విస్తృతంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం జారీ చేసిన నియమ నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ నామినేషన్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల విధుల పట్ల పూర్తి అప్రమత్తతతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె సూచించారు.మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా హుజురాబాద్, జమ్మికుంట మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ ప్రత్యక్షంగా సందర్శించి అక్కడ చేపట్టిన ఏర్పాట్లను సమగ్రంగా సమీక్షించారు. నామినేషన్ కౌంటర్లు, హెల్ప్ డెస్క్ లు, భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది విధుల నిర్వహణ తీరును పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు.

నామినేషన్ ఫారాలు, రిజిస్టర్లు, రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్, ఆయా వార్డుల నుంచి దాఖలైన నామినేషన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, అభ్యంతరాల పరిష్కారం, అప్పీళ్ల ప్రక్రియ, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన తదితర అన్ని దశలు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సమయపాలనతో, లోపాలేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు.

దాఖలైన నామినేషన్ల వివరాలను ప్రతి రోజు వెంటవెంటనే టీ--పోల్ (౦-ాశీశ్రీశ్రీ) యాప్ లో అప్లోడ్ చేయాలని, డేటా నమోదు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. అభ్యర్థులు అన్ని అవసరమైన పత్రాలు, వివరాలతో నామినేషన్ పత్రాలను సమర్పించేలా హెల్ప్ డెస్క్ ల ద్వారా పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని, వారి సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేయాలని సూచించారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుబడి పాటిస్తూ మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన మార్గనిర్దేశం అందించాలని తెలిపారు.

ఈ నెల 30వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేసుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ వివరించారు. నామినేషన్ పత్రాల స్క్రూటినీ కోసం తగినంత అనుభవజ్ఞులైన సిబ్బందిని నియమించామని, ఎన్నికల సంఘం నియమ నిబంధనలను శతప్రతిశతం పాటిస్తూ ఎలాంటి వివాదాలకు తావులేకుండా ఎన్నికలు నిర్వహిస్తామని ఆమె భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ ఎండి. ఆయాజ్, జమ్మికుంట తాహసిల్దార్ నల్ల వెంకట్ రెడ్డి హుజురాబాద్ మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్ తో పాటు సంబంధిత ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాజశ్యామల యాగం లో పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

**భారతీయ వెలుగు , సంగారెడ్డి ప్రతినిధి:**



రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డిలోని పోతిరెడ్డి పల్లి చౌరస్తా సమీపంలో దత్తగిరి ఆశ్రమం అధ్వర్యంలో లోక కల్యాణార్థం నిర్వహించిన శ్రీ రాజ శ్యామల యాగంలో పాల్గోన్నారు. ఈ సందర్భంగా దత్తగిరి ఆశ్రమం పీఠాధిపతి అవధూతగిరి మహారాజ్ నేతృత్వంలో పండితులు, వేద పాఠశాల విద్యార్థులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. వేద పండితులు తమ మంత్రోచ్ఛారణాలతో రాజశ్యామల యాగంను మంత్రి దామోదర్ రాజనర్సింహచే నిర్వహించారు. అనంతరం పూర్ణహుతి కార్యక్రమంలో పాల్గోని అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు.

# రామగుండం పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**– ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్**



**భారతీయ వెలుగు ప్రతినిధి గోదావరిఖని జనవరి 28:** పరిశ్రమలకు పుట్టినిల్లుగా ఉన్న రామగుండం నియోజకవర్గాన్ని పునర్నిర్మానం చేసే కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని రామగుండం శాసనసభ్యులు మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ పిలుపునిచ్చారు గోదావరిఖని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ముద్రించిన 2026వ సంవత్సర క్యాలెండర్లను బుధవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ప్రెస్ క్లబ్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమశీ సందర్భంగా ఎమ్మెల్యే మక్కాన్సింగ్ మాట్లాడుతూ అన్ని వనరులు అందుబాటులో ఉండి కూడా దశాబ్దాల కాలంగా రామగుండం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాను వేదికగా చేసుకొని అసత్యపు ప్రచారాలు ఆరోపణలు విమర్శలు చేయడం చాలా తప్పని ఎమ్మెల్యే ఈ సందర్భంగా సూచించారు. సింగరేణి, ఎన్టీపీసీ నిధులతో గత పాలకులు ఇతర ప్రాంతాలను అభివృద్ధి చేశారే తప్ప మన ప్రాంత ప్రగతిని పట్టించుకోలేదని ఆరోపించారు. నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచిన తాను ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధి కోసం ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. మార్పు ఇప్పుడే మొదలైందని రాబోయే రోజుల్లో ఘనమైన అభివృద్ధిని ప్రజల ముందు ఆవిష్కరిస్తానని అన్నారు. ప్రెస్ క్లబ్ అభివృద్ధికి సభ్యుల సంక్షేమానికి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మాధవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి గడ్డం శ్యాం కుమార్ గౌడ్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు బొంతల రాజేష్, సీనియర్ జర్నలిస్టులు అల్లంకి లక్ష్మయ్య, వేల్పుల నారాయణ, శ్రీ దాస్యం లక్ష్మయ్య, కోల లక్ష్మణ్, మాదాసు రామమూర్తి, పూదరి కుమార్, పందిళ్ళ శ్యాంసుందర్, చంద్రశేఖర్ రెడ్డి, తగరపు శంకర్, నిట్టూరి జీవన్ బాబు, జక్కం సత్యనారాయణ, రామ్ శంకర్, సత్యం, గోలి సమ్మిరెడ్డి, పాలకుర్తి విజయ్ కుమార్, వాసు ఏబీఎన్ శేఖర్, గంట రవి, శంకర్, కుమార్, కిషన్, చందుపట్ల తిరుపతిరెడ్డి, రంగు తిరుపతి, బొల్లం మధుబాబు, రామ్ దేని సదానందం, ఎస్కే శంకర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో టిఆర్పి పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తా..

**టీఆర్పీ పార్టీ నాయకుడు, సీనియర్ జర్నలిస్ట్ తొగరి కరుణాకర్**



**భారతీయ వెలుగు ప్రతినిధి వేములవాడ**

వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని టిఆర్పి పార్టీ నాయకుడు సీనియర్ జర్నలిస్ట్ తొగరి కరుణాకర్ అన్నారు. బుధవారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్థాపించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి రజిని కుమార్ యాదవ్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బుర్ర మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో తొగరి కరుణాకర్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ బిసిల హక్కుల కోసం ఏర్పడ్డ ఏకైక పార్టీ తెలంగాణ రాజ్యాధికార పార్టీ అని తెలిపారు. వేములవాడ 28 వార్డుల్లో పార్టీ తరుపున అభ్యర్థులను గెలిపించుకునే దిశగా పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అఖిల్ పాషా, సిరిసిల్ల నాయకులు మల్లేష్, వేములవాడ నాయకులు కోరేపు అనిల్, లాల శేఖర్, దుర్గ ప్రసాద్, శేఖర్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల కోరికలు తీర్చే కొంగుబంగారం గట్టు మల్లన్న స్వామి

**భారతీయ వెలుగు ప్రతినిధి ఇల్లందకుంట జనవరి 28**



కరీంనగర్ జిల్లా, ఇల్లందకుంట మండలం పరిధిలోని మల్లన్నపల్లి--రాచపల్లి గ్రామాలలో కొలువై ఉన్న ఆది శైవ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీ గట్టు మల్లన్న దేవాలయం మరోసారి భక్తి వైభవంతో పులకించిపోయింది. తరతరాలుగా గ్రామ ప్రజల ఇష్టదైవంగా, కాపాడే దేవుడిగా, కష్టాలను తీర్చే కల్పవృక్షంగా కొలువై ఉన్న శ్రీ గట్టు మల్లన్న స్వామి మహిమ మరోసారి ప్రత్యక్షంగా దర్శనమిచ్చిన ఘట్టంగా ఈ కార్యక్రమం నిలిచింది.

దేవాలయ ప్రాంగణంలో పవిత్రంగా భావించే సూది మాను గుండు వద్ద, సాక్షాత్తు శివస్వరూపుడైన శ్రీ గట్టు మల్లన్న స్వామి ప్రతిరూపాన్ని కళా రూపంలో ఆవిష్కరించడం జరిగింది. ఈ ఆర్ట్ రూపం కేవలం చిత్రకళ మాత్రమే కాకుండా, భక్తి భావంతో నిండిన ఆధ్యాత్మిక సాధనగా మారింది. మల్లన్న స్వామి కటాక్షం కళ్లలో మెదలేలా, ఆయన మహత్యం హృదయాల్లో ప్రతిధ్వనించేలా ఈ ప్రతిరూపం భక్తులను పరవశుల్ని చేసింది.

ఈ దివ్యమైన కార్యాన్ని తన చేతుల ద్వారా సాకారం చేసిన అడవి శ్రీరాంపూర్ వాస్తవ్యులు తమ్ముడు మెరుగు కుమారస్వామి గారు నిజంగా మల్లన్న స్వామి ఆశీస్సులతో జన్మించిన కళాకారుడని భక్తుల అభిప్రాయం. ఆయన తన కళను ధనార్జనకు కాకుండా, స్వామికి అంకిత సేవగా భావించి, అహంకారం లేని భక్తితో ఈ మహత్తర కార్యాన్ని పూర్తి చేయడం అభినందనీయం. ఇది కళ కాదు... ఇది భక్తి. ఇది పని కాదు... ఇది పూజ.

మెరుగు కుమారస్వామి రూపుదిద్దిన మల్లన్న స్వామి ప్రతిరూపం, సూది మాను గుండు వద్ద నిలిచే ప్రతి భక్తుడికి “స్వామి నిన్ను చూస్తున్నాడు” అన్న భావాన్ని కలిగిస్తోంది. ఈ ఆర్ట్ దర్శనం చేసిన భక్తులు తమ మనసుల్లో ఉన్న బాధలు తరిగిపోయాయని, హృదయం నిండా శాంతి కలిగిందని భావోద్వేగంతో వ్యక్తం చేస్తున్నారు.

ఈ పవిత్ర సందర్భంలో రాచపల్లి మరియు మల్లన్నపల్లి గ్రామాలకు చెందిన మల్లన్న భక్తులమందరం, శిరసు వంచి, చేతులు జోడించి, ఈ దివ్య సేవను అందించిన మెరుగు కుమారస్వామి కి భక్తి పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. మల్లన్న స్వామి కృపతో ఆయనకు ఆయురారోగ్యాలు, కళా సిద్ధి, కీర్తి ప్రతిష్టలు మరింతగా ప్రసాదించాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాము.

గట్టు మల్లన్న స్వామి ఆశీస్సులతో మా గ్రామాలు ఎల్లప్పుడూ పంటలతో పచ్చగా ఉండాలని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, ప్రతి ఇంటా సుఖశాంతులు నెలకొనాలని భక్తులంతా వేడుకుంటున్నారు. “మల్లన్నా... మాకు దిక్కు నీవే, దైవమా మా దైవమా” అనే నినాదం గ్రామాలంతటా మార్మోగుతోంది.

# వేములవాడలో తొలిరోజే 16 నామినేషన్లు

**– కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 5, బీజేపీ 3 నామినేషన్లు**




**భారతీయ వెలుగు ప్రతినిధి వేములవాడ**

వేములవాడ మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో పట్టణంలో రాజకీయ కోలాహలం మొదలైంది. మున్సిపాలిటీ పరిధిలోని 28 వార్డులకు గాను నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రారంభమైంది. తొలిరోజు మొత్తం 16 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు తమ మద్దతుదారులతో తరలివచ్చి నామినేషన్ పత్రాలను సమర్పించారు. మొదటి రోజు దాఖలైన నామినేషన్ల వివరాలను పరిశీలిస్తే అధికార కాంగ్రెస్ పార్టీ నుండి అత్యధికంగా 8 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా, బీఆర్ఎస్ పార్టీ నుండి 5 మంది, బీజేపీ నుండి ముగ్గురు అభ్యర్థులు తమ పత్రాలను దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులెవరూ మొదటి రోజు నామినేషన్లు వేయలేదు. ఎన్నికల నియమావళిని అనుసరించి అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పించారని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణంలోని 28 వార్డుల్లో ప్రధాన పార్టీల మధ్య గట్టి పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తోంది...

# జాతీయ ఉపాధి హామీ చట్టం నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగించడానికి ఖండిస్తూ బచావో బీజేపీ బచావో నినాదంతో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న

- ఏఐసీసీ ఇన్చార్జి శ్రీమతి మీనాక్షి నటరాజన్.
- టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్
- మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు
- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావ్
- మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్



**భారతీయ వెలుగు వెల్దుర్తి మాసాయిపేట ప్రతినిధి జనవరి 28**

మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం కొరివిపల్లిలో జాతీయ ఉపాధి హామీ చట్టం పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని ఖండిస్తూ ఎంజిఎన్ఆర్ఈజీఏ బచావో, బీజేపీ హటావో నినాదంతో నిరసన కార్యక్రమంలో ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ,టీపీసీసీ అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మల్కాజిగిరి మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు,మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ పాల్గొనారు. కోరివిపల్లి లోనిదుర్గామాతదేవాలయంలో పూజలు నిర్వహించి ఉపాధి హామీ కూలీలతో ముఖాముఖిగాసంభాషించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చరిత్రను చెరిపేసే ప్రయత్నం చేస్తోందని, గాంధీజీ పేరును తొలగించడం ద్వారా పేదల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందని మండిపడ్డారు. గరిబోళ్ళకోసం సోనియా గాంధీ అనంతపురం పర్యటనలో ఉన్నపుడు పనికి ఆహార పథకం తీసుకొచ్చారని చెప్పారు. అనంతరపురంలో అన్ని ఇళ్లకు తాళాలు ఉంటే...సోనియా గాంధీ మన్మోహన్ సింగ్ కు చెప్పి పనికి ఆహార పథకాన్ని మొదలు పెట్టారని చెప్పారు. గ్రామ జనం పటిష్టంగా ఉంటే గ్రామాలు సౌభాగ్యంగా ఉంటాయన్నారు. కానీ మోడీ, అదానీ, అంబానీల కోసం పనికి ఆహర పథకాన్ని తొలగించాలని చూస్తున్నారని విమర్శించారు. పనికి ఆహర పథకం కోసం సోనియా గాంధి, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పార్లమెంట్ లో పోరాటం చేస్తున్నారని చెప్పారు.ఫిబ్రవరి నాటికి గ్రామీణ ఉపాధీ హామీ పథకం తీసుకొచ్చి 20 ఏళ్లు పూర్తవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ గరిబోళ్ల పార్టీ, ఎస్సీ,ఎస్టీ,బీసీల వెనుక కాంగ్రెస్ పార్టీ ఉంటుంది మోడీకి వ్యతిరేకంగా గ్రామాల్లో మహిళలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేదల కడుపు నింపే పథకం. కేంద్ర ప్రభుత్వం నిధులు కోత పెట్టి, రాష్ట్రాలపై భారం మోపుతూ ఈ పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తోంది. పేదల ఆకలికంటే కార్పొరేట్ లాభాలకే పెద్దపీట వేస్తుంది. ఈపథకాన్నికాపాడుకోవాలంటే గ్రామాల్లోకి వచ్చి కేంద్రం చేస్తున్న కుట్రలు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ పీసీసీ అధ్యక్షులు హనుమంతు రావు, టీపీసీసీ జనరల్ సెక్రటరీలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, టీపీసీసీ కోఆర్డినేటర్లు, దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి శ్రీనివాస్ రెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జి ఆవులరాజి రెడ్డి,మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సుహాసిని రెడ్డి, సీనియర్ నాయకులు బ్లాక్, మండల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనారు

# రామగుండంలో గెలుపు ఖాయం..

**– దీమా వ్యక్తం చేసిన మంత్రులు జూపల్లి, శ్రీధర్ బాబు**





**భారతీయ వెలుగు ప్రతినిధి గోదావరిఖని జనవరి 28:** పెద్దపల్లి పార్లమెంటు పరిదిలో 10 మున్సిపాలిటీలు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని మంత్రి జూపల్లి, శ్రీదర్ బాబు పేర్కొన్నారు. బుధవారం గోదావరిఖనిలో పర్యటించన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ నివాసంలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియా మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీదర్ బాబు మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలోని అన్ని మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోబోతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఈ మూడేళ్లతో పాటు మరో ఐదు సంవత్సరాలు అధికారంలో ఉండబోతుందని అన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ లో ప్రజలకు చేసింది ఏమిలేదని,కెసిఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశాడని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కంటే తెలంగాణ వచ్చిన తరువాత కేసీఆర్ 8లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేశారని మంత్రి జూపల్లి ఆరోపించారు. కెసిఆర్ చేసిన అప్పులకు ఆరువేల 500 కోట్ల రూపాయల వడ్డీని కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. రామగుండం కార్పొరేషన్ లో 60 డివిజన్లు ను కాంగ్రెస్ గెలుస్తుందని దీమా వ్యక్తం చేసారు. అన్ని సర్వేల ఆధారంగా గెలుపు గుర్రాలకి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వబోతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. మంత్రి శ్రీదర్ బాబు మాట్లాడుతూ సింగరేణి విషయంలో అసత్య ఆరోపణలు చేస్తున్నారని , జరుగుతున్న అవాస్తవాలు ప్రజలకు తెలియజేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏ నిబంధనలు పెట్టలేదని సైట్ విజిట్ గత ప్రభుత్వం నుండే ఉందని అన్నారు.ప్రభుత్వంపై ప్రతిపక్షాలు బురద చల్లుతున్నాయని అన్నారు.

మా హయంలో ఎలాంటి అవినీతి జరగలేదని పేర్కొన్నారు. సోషల్ మీడియా కొన్ని సామాజిక మాంద్యం లో అసత్యపు ప్రచారం చేస్తున్నారని అన్నారు. నలుగురు మంత్రులు కూర్చొని మాట్లాడుకుంటే తప్పా అని ప్రశ్నించారు. బొగ్గు స్కాం అంటు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, కెసిఆర్ ఇద్దరు కలిసి నాటకాలు ఆడుతున్నారని అన్నారు.

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మధ్య ఎలాంటి విభేదాలు లేవని అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో అందరు మంత్రులు కలిసే పనిచేస్తున్నారని తెలిపారు.

కొంతమంది విభేదాలు సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారని అన్నారు.

పార్టీ అధిష్టానం మేరకు కాంగ్రెస్ పార్టీ మంత్రులు నాయకులు కలిసికట్టుగా పనిచేస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

# రహదారి భద్రత మన అందరి బాధ్యత

**-- హుజురాబాద్ మోటార్ వాహనముల తనిఖీ అధికారి కంచి వేణు**

**భారతీయ వెలుగు ప్రతినిధి ఎ హుజురాబాద్ ఎ జనవరి 28**

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాన్ని పురస్కరించుకుని హుజురాబాద్ పట్టణంలో రహదారి భద్రతపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారి భద్రత అనేది ఒక్క ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాకుండా, రోడ్డుపై ప్రయాణించే ప్రతి పౌరుడి బాధ్యత అని హుజురాబాద్ మోటార్ వాహనముల తనిఖీ అధికారి కంచి వేణు స్పష్టం చేశారు.

ప్రధాన అతిథులుగా హాజరైన అధికారులు

ఈ జాతీయ రోడ్డు భద్రత మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా

హుజురాబాద్ డివిజన్ పోలీస్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ వి. మాధవి,

కరీంనగర్ జిల్లా ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్,

హుజురాబాద్ పట్టణ సీఐ టి. కరుణాకర్,

జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ చందు,

పీహెచ్సీ డాక్టర్ తులసీదాస్

హాజరై, ప్రజలకు రోడ్డు భద్రతపై కీలక సందేశాలు అందించారు.

లారీ అసోసియేషన్ ఆవరణలో అవగాహన కార్యక్రమం

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం సందర్భంగా మోటార్ వాహనముల తనిఖీ అధికారి కంచి వేణు ఆధ్వర్యంలో హుజురాబాద్ లారీ అసోసియేషన్ ఆవరణలో లారీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, వాహనదారులకు విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ రహదారి భద్రతపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని స్పష్టం చేశారు.

అతివేగమే ప్రమాదాలకు ప్రధాన కారణం

ఈ సందర్భంగా కంచి వేణు మాట్లాడుతూ, “అతివేగం ప్రమాదకరం. ముందుగా





బయలుదేరి నెమ్మదిగా ప్రయాణిస్తే క్షేమంగా గమ్యానికి చేరుకోవచ్చు” అని సూచించారు. అధిక వేగంతో వాహనాలు నడపడం వల్లే ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి కారణంగా అమూల్యమైన ప్రాణాలు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

డ్రైవింగ్?లో నైపుణ్యం లేకపోవడం, రోడ్డు భద్రతా జాగ్రత్తలు పాటించకపోవడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం, సరైన అవగాహన లేకుండా వాహనాలు నడపడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.

డ్రైవర్లకు కీలక సూచనలు

వాహనదారులు తప్పనిసరిగా పాటించాల్సిన నియమాలను కంచి వేణు విపులంగా వివరించారు.

డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదు

ట్రాఫిక్ పరిస్థితులను గమనిస్తూ సహనంతో వాహనాలు నడపాలి

మలుపులు, రద్దీ ప్రాంతాల్లో వాహనాన్ని నెమ్మదిగా నడపాలి

సరైన హారన్ వినియోగించాలి

రాత్రి వేళ ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు హెడ్?లైట్?ను డిప్ చేయాలి

నిర్ధారిత పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలను నిలిపివేయాలి

రాత్రివేళ వాహనం నిలిపినప్పుడు పార్కింగ్ లైట్లు తప్పనిసరిగా వేయాలి

వాహనం నడుపుతున్నప్పుడు పక్కవారితో సంభాషించకూడదు

మలుపులు తిరిగేటప్పుడు, వాహనం ఆపేటప్పుడు చేతి సంకేతాలు ఇవ్వాలి

ఆటోలు, మోటార్ క్యాబ్?లలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదు

మద్యం, మొబైల్ డ్రైవింగ్?కు కఠిన హెచ్చరిక

మద్యం సేవించి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమని, ఇది డ్రైవర్ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పుగా మారుతుందని హెచ్చరించారు.

అలాగే మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం ప్రమాదాలను ఆహ్వానించడమేనని స్పష్టం చేశారు.

ఇన్సూరెన్స్ రెన్యువల్, ట్యాక్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లు వాహనాల్లో తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.

హెల్మెట్, సీట్?బెల్ట్ తప్పనిసరి

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్?బెల్ట్ ధరించాలని సూచించారు. ఇవి చట్టపరమైన నిబంధనలు మాత్రమే కాకుండా మన కుటుంబాల భద్రతకు అవసరమైన రక్షణ కవచాలు అని గుర్తు చేశారు.

కుటుంబం కోసం జాగ్రత్త అవసరం

వాహనదారులు బయటకు వెళ్లేటప్పుడు ఒక విషయం గుర్తుంచుకోవాలని ఆయన భావోద్వేగంగా పేర్కొన్నారు.

“మీ కోసం ఇంట్లో వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులు ఉంటారు. ఒక ప్రమాదం జరిగితే ఆ కుటుంబం మొత్తం రోడ్డున పడే పరిస్థితి వస్తుంది” అని తెలిపారు.

గోల్డెన్ అవర్ -- ప్రాణాలను కాపాడే కీలక సమయం

జాతీయ రోడ్డు భద్రతా మాసం సందర్భంగా వైద్య శాఖ ఆధ్వర్యంలో లిప్రాథమిక చికిత్స (ఫస్ట్ ఎయిడ్)లిపై ప్రత్యేక శిక్షణ అందించారు.

ప్రమాదం జరిగిన మొదటి గంటను లి‘గోల్డెన్ అవర్’లిగా పిలుస్తారని, ఈ సమయంలో సరైన చికిత్స అందిస్తే అనేక ప్రాణాలు కాపాడవచ్చని వైద్యులు వివరించారు.

ప్రాథమిక చికిత్సపై అవగాహన

వెంటనే 108 అంబులెన్స్ లేదా 100 / 112 పోలీస్ నంబర్లకు సమాచారం ఇవ్వాలి

రక్తస్రావం ఉంటే శుభ్రమైన గుడ్డతో గట్టిగా నొక్కి ఆపాలి

బాధితుడు శ్వాస తీసుకుంటున్నాడా లేదా గమనించాలి

అవసరమైతే శిక్షణ పొందినవారు సీపీఆర్ చేయాలి

మెడ లేదా వెన్నెముక గాయాల అనుమానం ఉంటే బాధితుడిని కదపకూడదు

ప్రతి వాహనంలో తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలని సూచించారు.

సురక్షిత సమరైటన్ చట్టంపై అవగాహన

ప్రమాద బాధితులకు సహాయం చేసే వారికి ఎలాంటి పోలీసు లేదా కోర్టు వేధింపులు ఉండవని పేర్కొనే సురక్షిత సమరైటన్ చట్టంపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు.

అధికారుల సందేశాలు

ఏసీపీ వి. మాధవి

మద్యం సేవించి వాహనం నడపరాదని, హెల్మెట్, సీట్?బెల్ట్ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. రాష్ డ్రైవింగ్, అధిక వేగం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు.

ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్

ప్రయాణంలో తప్పనిసరిగా హెల్మెట్, సీట్?బెల్ట్ ధరించాలని సూచించారు. వేగాన్ని నియంత్రించుకుంటూ ప్రయాణిస్తేనే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

కార్యక్రమంలో పాల్గొన్నవారు

ఈ కార్యక్రమంలో లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కప్పల రాజయ్య, లారీ ఓనర్లు, డ్రైవర్లు, రవాణా శాఖ సిబ్బంది, కానిస్టేబుల్ కత్తుల నాగరాజు, హోంగార్డ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లిలిట్రాఫిక్ నియమాలు పాటిద్దాం...

రోడ్డు ప్రమాదాలను అరికడదాం...

సురక్షితమైన సమాజాన్ని కలిసి నిర్మిద్దాం...

# ఎన్నికల కేంద్రాల సమగ్ర తనిఖీ

**శాంతియుత, పారదర్శక ఎన్నికల నిర్వహణే లక్ష్యం : సీపీ గౌష్ ఆలం**

**భారతీయ వెలుగు ప్రతినిధి జమ్మికుంట జనవరి 28 :** హుజురాబాద్ ఒ జమ్మికుంట మున్సిపాలిటీల్లో త్వరలో నిర్వహించనున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎన్నికల నిర్వహణ ఎటువంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా ముందస్తు చర్యల్లో భాగంగా ఆయన నేడు హుజురాబాద్, జమ్మికుంట పట్టణాల్లో విస్తృతంగా పర్యటించి ఎన్నికల కేంద్రాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియకు అత్యంత కీలకమైన నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల భద్రతా ఏర్పాట్లను సీపీ గౌష్ ఆలం స్వయంగా పరిశీలించారు.

నామినేషన్ కేంద్రాల పరిశీలన

హుజురాబాద్, జమ్మికుంట మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను సందర్శించిన సీపీ, అక్కడ ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు,




సీసీటీవీ నిఘా, ప్రవేశ--నిష్క్రమణ మార్గాలపై అధికారులతో చర్చించారు. నామినేషన్ ప్రక్రియ సమయంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, వారి అనుచరుల మధ్య ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు.

స్ట్రాంగ్ రూమ్ లు -- కౌంటింగ్ కేంద్రాల తనిఖీ

హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, జమ్మికుంట డిగ్రీ మరియు పీజీ కళాశాలల్లో ఏర్పాటు చేయనున్న కౌంటింగ్ కేంద్రాలను, బ్యాలెట్ బాక్సులు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను సీపీ గౌష్ ఆలం క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 24 గంటల నిఘా, బలమైన భద్రతా వలయం



తప్పనిసరిగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

కఠిన భద్రతా సూచనలు

ఎన్నికల సమయంలో ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, కేంద్రాల పరిసరాల్లో నిరంతర పోలీస్ పహారా కొనసాగించాలని సీపీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బందోబస్తు విషయంలో ఎటువంటి అలసత్వం వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు భయభ్రాంతులకు లోనుకాకుండా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ శాఖ పూర్తి బాధ్యతతో పనిచేయాలని తెలిపారు.

పోలీస్ అధికారుల పాల్గొనడం

ఈ పర్యటనలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం వెంట ఏసీపీ మాధవి, జమ్మికుంట ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, హుజురాబాద్ ఇన్ స్పెక్టర్ కరుణాకర్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్



**భారతీయ వెలుగు ప్రతినిధి రాజన్న సిరిసిల్ల**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల మున్సిపాలిటీలో ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రాలను రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా నామినేషన్ కేంద్రాల్లో చేసిన ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# తహసిల్దార్ బాధ్యతల స్వీకరణ

**భారతీయ వెలుగు ప్రతినిధి వేములవాడ**



వేములవాడ అర్బన్ మండల తహసిల్దార్ గా బుధవారం ఆకారపు జయంత్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన విజయ ప్రకాష్ రావు తంగళ్ళపల్లి మండల కేంద్రానికి బదిలీ కాగా, తంగళ్ళపల్లి లో విధులు నిర్వహించిన జయంత్ వేములవాడలో బాధ్యతలు చేపట్టారు.

# ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల నిర్వహణ

**రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**వేములవాడ నామినేషన్ కేంద్రం పరిశీలన**



**భారతీయ వెలుగు ప్రతినిధి వేములవాడ**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణ స్వేచ్ఛగా ప్రశాంతంగా జరిగే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిన నేపథ్యంలో వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా ఇంచార్జి కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాల్లో ఓటర్ జాబితా, రిజర్వేషన్ జాబితా, నో డ్యూ సర్టిఫికెట్, ఇతర ఏర్పాట్లను పరిశీలించి, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల్లో తగిన సంఖ్యలో సిబ్బంది అందుబాటులో ఉండాలని, క్యూలైన్ నిర్వహణ, తదితర అంశాలపై దృష్టి సారించాలని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకోవాలని, సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. ప్రతి నామినేషన్ కేంద్రంలో గడియారం ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు, ప్రజలకు త్రాగునీరు, తదితర సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలు, నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరగకుండా పర్యవేక్షణ జరపాలని అధికారులకు ఆదేశించారు. నామినేషన్ దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ నుండి 30 వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుంచి 05.00 గంటల వరకు నామినేషన్లు స్వీకరించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రం వద్ద 100 మీటర్ల వరకు రెండు వాహనాలకు అనుమతి ఉంటుందని తెలిపారు. వేములవాడలో 28 వార్డులకు సంబంధించి 10 మంది ఆర్ఓలు,10 మంది ఏఆర్ఓలను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా నియమించామని తెలిపారు. ఎస్ఎస్టీ, ఎఫ్ఎస్టీ టీం లను నియమించామని విచారించారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చామని వెల్లడించారు. పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నూతన బ్యాంకు ఖాతా, అఫిడవిట్, బలపరిచే వారి వివరాలు, మిగతా పత్రాలు సమర్పించాలని సూచించారు. ప్రతి మున్సిపల్ కేంద్రంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని తెలిపారు. వారి వద్ద పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. జిల్లా యంత్రాగం, మున్సిపల్, పోలీసుల ఆద్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, తహసీల్దార్ జయంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, పట్టణ సీఐ వీరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీం ఆదేశాలతో అనర్హతపై స్పీకర్ విచారణ

**ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు నోటీసులు జారీ**

**30న ఉదయం స్పీకర్ కార్యాలయంలో హాజరు కావాలని ఆదేశం**

తెలంగాణ రాజకీయాల్లో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల అంశంపై సుప్రీంకోర్టు సీరియస్ కావడంతో.. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వేగం పెంచారు. ఇందుకు సంబంధించి తాజాగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం ఈ విషయం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ నెల 30వ తేదీన ఉదయం స్పీకర్ కార్యాలయంలో హాజరు కావాలని దానం నాగేందర్‌ను ఆదేశించారు. అదేవిధంగా ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి కూడా నోటీసులు అందాయి. ఇందులో భాగంగా ఉదయం 10:30 గంటలకు బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరగనుండగా.. మధ్యాహ్నం 12:00 గంటలకు బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరగనుంది. ఎమ్మెల్యేల అనర్హత అంశంలో జాప్యం జరుగుతోందని భావించిన సుప్రీంకోర్టు ఈ నెల 19న స్పీకర్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. చర్యలు తీసుకోకపోతే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించిన నేపథ్యంలో, స్పీకర్ పెండింగ్‌లో ఉన్న ముగ్గురు ఎమ్మెల్యేలుదానం నాగేందర్, కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్ అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఇప్పటికే

# సెకండ్ ఎడిషన్ సి. ఎం కప్--2025 సాధించాలి.

**రిజిస్ట్రేషన్లు ఎక్కువగా పెంచాలి.**
**అధికారులతో సీఎం కప్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహణ.**
**సీఎం కప్ సాధించే దిశగా క్రీడాకారులకు ప్రత్యేక మెళకువలు నేర్పించాలి.**
**డి ఆర్ వో ఈ. వెంకటాచారి.**



హైదరాబాద్ జనవరి 28 భారతీయ వెలుగు

సెకండ్ ఎడిషన్ సీఎం కప్ 2025 ను సాధించే దిశగా విద్యార్థులకు వివిధ క్రీడా విభాగాల్లో ప్రత్యేక మెళకువలు అందించాలని జిల్లా రెవిన్యూ అధికారి ఈ. వెంకటాచారి సూచించారు. సెకండ్ ఎడిషన్ సీఎం కప్--2025 నిర్వహణకు సంబంధించి జిల్లా యువజన మరియు క్రీడల కార్యాలయం ఆధ్వర్యంలో, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి అధ్యక్షతన హైదరాబాద్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సీఎం కప్--2025 నిర్వహణకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికపై సమావేశంలో సమగ్రంగా సమీక్షించారు. మండల స్థాయి పోటీలు ఫిబ్రవరి 2 , 3 తేదీలలో నిర్వహించనున్నట్లు తెలియజేశారు. వివిధ అధికారుల అధ్యక్షతన మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి అలాగే జిల్లాస్థాయి కమిటీలు ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. ఈ కమిటీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిబద్ధతతో వ్యవహరించాలని క్రీడా విధి విధానాలపై అవగాహన కల్పించారు. అలాగే గత సీఎం కప్ ఎడిషన్లలో హైదరాబాద్ జిల్లా కప్ సాధించిందని ఈ సందర్భంగా గుర్తు చేస్తూ ఈసారి కూడా హ్యాట్రిక్ విజయాన్ని సాధించేందుకు నియమించిన కమిటీ సమన్వయంతో కలసి పనిచేయాలని సూచించారు. యువతను విస్తృతంగా భాగస్వామ్యులను చేయడం, ఉత్తమ క్రీడాకారులను గుర్తించడం, గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ సహకారంతో తగిన మౌలిక వసతులు, పరికరాలు అలాగే విశాలమైన మైదానాల ఎంపిక , వనరుల సమీకరణపై వివరించారు. పిల్లలు ఎక్కువగా క్రీడల్లో పాల్గొనే విధంగా రిజిస్ట్రేషన్ సంఖ్యను ఎక్కువగా పెరిగే విధంగా ప్రత్యేక కృషి చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. అదేవిధంగా క్రీడ మైదానాలలో షామీయా నాలు, త్రాగునీరు, మెడికల్ శిబిరాలు తప్పక ఉండాలని సూచించారు.

జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ (క్రీడలు) హేమలత మాట్లాడుతూ, రిజిస్ట్రేషన్లే ఈ కార్యక్రమంలో అత్యంత కీలకమైన అంశం అని పేర్కొని, గేమ్స్ ఇన్‌స్ట్రక్టర్లు, కోచ్‌లు, జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్లు మరియు ఫీల్డ్ స్థాయి సిబ్బంది అందరూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు గరిష్టంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

నగరవ్యాప్తంగా ఉన్న జీహెచ్ఎంసీ మైదానాలు, క్రీడా సముదాయాల గుర్తింపు, అందుబాటులో ఉన్న వసతుల వినియోగం, పరికరాల అందచేతపై ఆమె వివరించారు.జిల్లా యువజన మరియు క్రీడల అధికారి సుధాకర్ మాట్లాడుతూ మండల మరియు జిల్లా స్థాయిల్లో ఫెడరేషన్ నిబంధనలు, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పోటీలు క్రమబద్ధంగా, కాలపరిమితిలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

రిజిస్ట్రేషన్లు, మైదానాల ఎంపిక, అర్హత గల సాంకేతిక అధికారులు, కోచ్‌ల నియామకం , పరికరాల అందుబాటు, అలాగే ఫలితాలను అదే రోజు అప్‌లోడ్ వంటి అంశాలపై తెలిపారు.సీఎం కప్--2025 లక్ష్యం గ్రాస్‌రూట్ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం, పట్టణ--గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను గుర్తించడం, మండల మరియు జిల్లా స్థాయిల్లో క్రీడా పోటీల ద్వారా భవిష్యత్ ఛాంపియన్లను తీర్చిదిద్దడం అని ఆయన వివరించారు. దీర్ఘకాలికంగా ఒలింపిక్స్--2036లో పతకాల సాధనకు దోహదపడేలా ఈ కార్యక్రమం రూపకల్పన చేయబడిందన్నారు. ఈ కప్‌లో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖో--ఖో, వాలీబాల్, యోగా, క్యారమ్, చెస్, కరాటే, బ్యాడ్మింటన్, బేస్‌బాల్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, సైక్లింగ్, హ్యాండ్‌బాల్, జూడో, కిక్‌బాక్సింగ్, నెట్‌బాల్, స్విమ్మింగ్, రెజ్లింగ్, వూషూ, బాల్ బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్, హాకీ, పవర్ లిఫ్టింగ్, స్కేటింగ్, సాఫ్ట్‌బాల్, తైక్వాండో, పారా గేమ్స్ పిల్లల కోసం వినోదాత్మక క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి పవన్, ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరులు, పాఠశాల విద్య సహాయ సంచాలకులు శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర క్రీడల అథారిటీ ప్రత్యేక అధికారి సతీష్ రెడ్డి, అన్ని మండలాల తహసీల్దార్లు, ఫిజికల్ డైరెక్టర్లు, పి ఈ టి లు, కోచ్‌లు, స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్లు, క్రీడా సంఘాలు, ఒలింపిక్ అసోసియేషన్లు మరియు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మేడారం మహాజాతరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు

**భక్తులకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యం : గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



హైదరాబాద్ ::జనవరి 28 భారతీయ వెలుగు

మేడారం లో ఈ రోజు నుండి నిర్వహిస్తున్న సమ్మక్క--సారలమ్మ మహాజాతర సందర్భంగా రాష్ట్ర ప్రజానీకానికి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజనుల ఆరాధ్య దేవతలైన సమ్మక్క--సారలమ్మలు ధైర్యసాహసాలు, త్యాగస్ఫూర్తి, ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకలని మంత్రి పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా విశేష గుర్తింపు పొందిన మేడారం మహాజాతర తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ వైభవాన్ని ప్రతిబింబించే మహోత్సవమని ఆయన అన్నారు.

ఈ పవిత్ర మహోత్సవం సందర్భంగా సమ్మక్క--సారలమ్మల ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరి కుటుంబాల్లో ఆరోగ్యం, శాంతి, సుఖసంతోషాలు నెలకొనాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ…“ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి గారి మార్గదర్శకత్వంలో మేడారం మహాజాతరకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేపట్టాం. రూ.250 కోట్ల నిధులు కేటాయించి మౌలిక వసతులు, త్రాగునీరు, వైద్య సేవలు, పారిశుధ్యం, రవాణా, విద్యుత్, భద్రతను మరింత బలోపేతం చేశాం.”

అదేవిధంగా, భారీగా తరలివచ్చే భక్తుల దృష్ట్యా ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికలు అమలు చేస్తున్నామని, పార్కింగ్ సదుపాయాలు విస్తరించినట్లు మంత్రి తెలిపారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

మహాజాతర సందర్భంగా గిరిజన సంప్రదాయాలు, ఆచారాలు ఎక్కడా భంగం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, భక్తుల భద్రత దృష్ట్యా పోలీస్, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ బృందాలు అప్రమత్తంగా ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు. భక్తులు శాంతియుతంగా, క్రమశిక్షణతో జాతరలో పాల్గొని దైవ దర్శనం చేసుకోవాలని కోరిన మంత్రి, ప్రభుత్వం చేపట్టిన ఏర్పాట్లకు భక్తుల సహకారం ఎంతో అవసరమని తెలిపారు.

# అన్నిరకాల సర్వీస్ ప్రొవైడర్ల నోడల్ అధికారులతో నగర సీపీ వీసీ సజ్జనర్ సమన్వయ సమావేశం

హైదరాబాద్ జనవరి 28 భారతీయ వెలుగు

హైదరాబాద్‌ను నేరరహిత నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పోలీస్ కమిషనర్ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ బుధవారం బషీర్‌బాగ్ లోని పాత కమిషనర్ కార్యాలయంలో అన్నిరకాల సర్వీస్ ప్రొవైడర్ల నోడల్ అధికారులతో కీలక సమన్వయ సమావేశం నిర్వహించారు. టెలికాం, ఇంటర్నెట్, ఫుడ్ డెలివరీ, కొరియర్, రవాణా, అన్ని రకాల సర్వీస్ ప్రొవైడర్ల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు.ఈ సమావేశంలో సీపీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ మాట్లాడుతూ.. కేసుల దర్యాప్తులో పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. సమాచారం అడిగిన వెంటనే స్పందించేందుకు వీలుగా ప్రతి సంస్థలో ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.కేవలం లాభార్జనే ధ్యేయంగా కాకుండా సర్వీస్ ప్రొవైడర్లు సామాజిక బాధ్యతతో



వ్యవహరించాలని హితవు పలికారు. ఈ-కామర్స్, కొరియర్ సేవల మాటున గంజాయి, మత్తు పదార్థాలు, నిషిద్ధ వస్తువుల రవాణా జరుగుతోందన్న ఆరోపణల నేపథ్యంలో… ఆయా సంస్థలు పటిష్టమైన నిఘా ఉంచాలని ఆదేశించారు.అనుమానిత పార్శిల్స్‌ను గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, నిబంధనలకు విరుద్ధంగా అసాంఘిక కార్యకలాపాలకు సహకరిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ట్రాన్స్ పోర్ట్ సర్వీస్ ప్రొవైడర్లలో కొంత మంది క్యాబ్, బైక్ డ్రైవర్లు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, దీనిని తీవ్రంగా పరిగణిస్తున్నామని తెలిపారు. సర్వీస్ ప్రొవైడర్లు తమ డ్రైవర్లపై నిరంతర పర్యవేక్షణ ఉంచాలని సూచించారు.ప్రయాణికులు బుక్ చేసుకున్నప్పుడు.. వెళ్లాల్సిన ప్రదేశం చెప్పిన తర్వాత లేదా డబ్బు చెల్లించిన తర్వాత డ్రైవర్లు రైడ్ క్యాన్సిల్ చేస్తున్నారని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇలాంటి డ్రైవర్లపై సంస్థలు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు సీపీలు ఎం.శ్రీనివాస్, ఐపీఎస్, తఫ్సీర్ ఇక్బాల్, ఐపీఎస్, శ్వేత, ఐపీఎస్, డీసీపీ సైబర్ క్రైమ్స్ అరవింద్ బాబు తో పాటు జోన్ల డీసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రంజాన్ మాసం సందర్భంగా అన్ని సౌకర్యాలు కల్పించాలి

**అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**

కరీంనగర్ జనవరి 28 భారతీయ వెలుగు

వచ్చే నెల 17 నుండి రంజాన్ మాసం ప్రారంభమవుతున్న దృశ్య జిల్లాలోని మసీదులు, ఈద్గాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సంబంధిత అధికారులను ఆదేశించారు. రంజాన్ మాసం ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో అడిషనల్ కలెక్టర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. సామూహిక నమాజ్ చేసే ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. మసీదుల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, దోమల సమస్య రాకుండా ఫాగింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు. రంజాన్ పర్వదినం నేపథ్యంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని, వీధిలైట్లు మరమ్మతులు ఉన్నచోట కొత్తవి అమర్చాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ప్రార్థన ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని తెలిపారు.

ప్రార్థన సమయాల్లో విద్యుత్ అంతరాయం




లేకుండా చూడాలని ఎలక్ట్రిసిటీ అధికారులను ఆదేశించారు. నగరంలో రద్దీ ఎక్కువగా ఉండే చోట ఉన్న ప్రార్థనా మందిరాల వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని ఏసీపీకి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డిఓ మహేశ్వర్, అడిషనల్ డిసిపి వెంకటరమణ, మున్సిపల్, ట్రాఫిక్, పోలీస్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయండి..

**కడుపులో పెట్టుకొని కాపాడుకుంటాం..**
**కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు**
**కాంగ్రెస్లో చేరిన 5వ డివిజన్ ముస్లిం మైనార్టీ నాయకులు..**



కరీంనగర్ జనవరి 28 భారతీయ వెలుగు

కార్పొరేషన్ ఎన్నికల్లో ముస్లిం మైనార్టీ నాయకులు కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు విజ్ఞప్తి చేశారు. అందర్నీ కడుపులో పెట్టుకొని కాపాడుకుంటామని స్పష్టం చేశారు. బుధవారం కరీంనగర్లోని 5 వ డివిజన్ రజ్వి చమన్ నుంచి ఎండి జైనుల్లాబుద్దీన్ పాటు 30 మంది ముస్లిం మైనారిటీ నాయకులు రాజేందర్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి రాజేందర్ రావు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు ను శాలువాలు పూలదండలతో రాజేంద్రావును మైనార్టీ నాయకులు సత్కరించారు. అనంతరం రాజేందర్ రావు మాట్లాడుతూ పార్టీ అభ్యర్థుల గెలుపునకు నాయకులు కార్యకర్తలు కష్టపడి పని చేయాలని సూచించారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి అధిష్టానం సముచిత స్థానం కల్పిస్తుందని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యం కల్పిస్తామని అభ్యర్థులకు గెలుపును కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎండి జైనుల్లా బుద్ధిన్ అలియాస్ జమీర్ పర్వేషాఖాన్ ఎండి ఇమాముద్దీన్ ముభిన్, జేషాన్ ఎంఎ రజాక్ కైరుద్దీన్, అబ్దుల్ రషీద్ తో పాటు పలువురు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా 62 వ డివిజన్ నుంచి పూరేళ్ల సరోజ రాజేందర్ రావును కలిసి సత్కరించారు.

## స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ (2.0) కింద నూతన ఎస్డబ్ల్యూఎం ఇంజినీర్లకు జిహెచ్ఎంసీ ఓరియెంటేషన్

**ప్రోగ్రామ్**
**-- స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26, ఘన వ్యర్థాలు, సీ డ డీ వ్యర్థాలు, బల్క్ గార్బేజ్ జనరేటర్లపై శిక్షణ**



హైదరాబాద్, జనవరి 28, 2026: భారతీయ వెలుగు

స్వచ్ఛ భారత్ మిషన్ -- అర్బన్ (2.0)లో భాగంగా జిహెచ్ఎంసీ బుధవారం నూతనంగా నియమితులైన
సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు , అసిస్టెంట్ ఇంజినీర్లకు ఓరియెంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ లో జిహెచ్ఎంసీ అదనపు కమిషనర్ (ఆరోగ్యం డ పారిశుధ్యం) రఘు ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించింది. కార్యక్రమంలో ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు -- 2024, వాటిలో జరిగిన తాజా సవరణలు, అలాగే ఫీల్డ్ స్థాయిలో అమలులో ఎదురయ్యే ఆపరేషనల్ సవాళ్లపై అధికారులకు అవగాహన కల్పించారు.
ఓరియెంటేషన్ కార్యక్రమంలో
రఘు ప్రసాద్ మాట్లాడుతూ నగర పారిశుధ్య వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం, వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలులో కఠినంగా వ్యవహరించడం ద్వారా స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో నగర పనితీరును మెరుగుపరచవచ్చు అన్నారు.
జిహెచ్ఎంసీ ఎస్ఈవీ సూపరింటెండింగ్ ఇంజినీర్ గోపాల్ మాట్లాడుతూ….
నూతనంగా చేరిన ఇంజినీర్లు ఫీల్డ్ స్థాయిలో చురుకైన పాత్ర పోషిస్తూ, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.
ఈ ఓరియెంటేషన్‌లో
స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26 (10వ ఎడిషన్) టూల్‌కిట్, ఘన వ్యర్థాల నిర్వహణ విధానాలు, నిర్మాణ డ కూల్చివేత (సీ డ డీ) వ్యర్థాల నిర్వహణ, అలాగే బల్క్ గార్బేజ్ జనరేటర్ల నిబంధనల అమలు వంటి అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు.
ఫీల్డ్ స్థాయిలో అవగాహన కార్యక్రమాల కోసం అవసరమైన ఐఈసీ మెటీరియల్‌ను కూడా స్వచ్ఛ భారత్ మిషన్ బాధ్యులు ఇంజినీర్లకు అందజేశారు.

# మార్చి నెలలో హైదరాబాదులో అఖిలభారత పోలీస్ ఫుట్ బాల్ సమరం

**74 వ బి.ఎన్.మల్లిక్ మెమోరియల్ ఆల్ ఇండియా పోలీస్ ఫుట్ బాల్ చాంపియన్ షిప్ నిర్వహణపై డిజిపి సమీక్ష**

:జనవరి 28 భారతీయ వెలుగు

74వ బి.ఎన్. మల్లిక్ మెమోరియల్ ఆల్ ఇండియా పోలీస్ ఫుట్ బాల్ ఛాంపియన్ షిప్ ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ బి శివధర్ రెడ్డి వెల్లడించారు. డిజిపి కార్యాలయంలో బుధవారం నాడు జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో డిజిపి శ్రీ బి.శివధర్ రెడ్డి మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో గతంలో చక్కని ఫుట్ బాల్ క్రీడాకారులు ఉండేవారని, 1956వ సంవత్సరంలో జరిగిన మెల్బోర్న్ ఒలింపిక్స్ లో సెమీఫైనల్ చేరిన భారత ఫుట్ బాల్ జట్టులో తెలంగాణ ప్రాంతానికి చెందిన ఏడుగురు క్రీడాకారులు నూర్ మొహమ్మద్, జుల్ఫీకరుద్దీన్, అహ్మద్ హుసేన్, అజీజుద్దీన్, బలరాం, తంగరాజ్, వంటివారు పాల్గొన్నారన్నారు. వీరిలో అయిదుగురు హైదరాబాద్ సిటీ పోలీస్ వారు. ఆ జట్టు కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీమ్ కూడా హైదరాబాదీయే. కాలక్రమేనా పోలీసు ఉద్యోగుల్లో ఫుట్ బాల్ క్రీడ పట్ల ఆసక్తి సన్నగిల్లిందని అభిప్రాయపడ్డారు. 74 వ బీ.ఎన్.మల్లిక్ అఖిల భారత ఫుట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించే అవకాశం ఈ సంవత్సరం తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖకు వచ్చిందన్నారు. ఛాంపియన్ షిప్ పోటీల పనులను వేగవంతంగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. తెలంగాణ పోలీస్ శాఖ ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీ ఈ ఏడాది మార్చి 23 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు హైదరాబాదులో నిర్వహించనున్నామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలు, 11 కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు




మరియు 6 కేంద్ర పోలీస్ సంస్థల నుంచి మొత్తం 53 జట్లు ఈ క్రీడా సమరంలో పాల్గొంటాయని డిజిపి తెలిపారు. సుమారు 1060 మంది పురుష క్రీడాకారులు, 350 మంది మహిళా క్రీడాకారులు, కోచ్‌లు, రిఫరీలు మరియు ఇతర అధికారులతో కలిపి మొత్తం 2000 మందికి పైగా ప్రతినిధులు ఈ వేడుకలో భాగస్వాములు కాబోతున్నారన్నారు. మొత్తం 12 రోజుల పాటు సాగే ఈ ఛాంపియన్‌షిప్‌లో 125 మ్యాచ్‌లను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం, అజీజ్ నగర్‌లోని ఎచ్‌ఎఫ్‌సి గ్రౌండ్, మొయినాబాద్‌లోని శ్రీనిధి ఫుట్‌బాల్ క్లబ్ మైదానాలతో పాటు మరికొన్ని ప్రధాన మైదానాల్లో ఈ పోటీలు జరగనున్నాయన్నారు.

ఈ మెగా ఈవెంట్ నిర్వహణకు తాను చైర్మన్ గాను, సైబరాబాద్ సిపి డాక్టర్ ఎం. రమేష్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా , అడ్మినిస్ట్రేషన్ కమిటీలో ఐపిఎస్ అధికారులు అభిలాషా బిస్త్, అనిల్ కుమార్, సంజయ్ కుమార్ జైన్, వి.సి. సజ్జనార్, అవినాష్ మహంతి, గజరావు భూపాల్ వంటి సీనియర్ అధికారులు వివిధ బాధ్యతలను నిర్వహిస్తారన్నారు. మార్చి 23న జట్ల రిపోర్టింగ్ తో ప్రారంభమయ్యే ఈ క్రీడల షెడ్యూల్‌లో భాగంగా మార్చి 25న మధ్యాహ్నం 3 గంటలకు అధికారికంగా ఆరంభ వేడుకలు జరగనున్నాయని, ఏప్రిల్ 5న తుది పోరు అనంతరం అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు ముగింపు వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ టోర్నీ కోసం తెలంగాణ పోలీస్ అకాడమీలో క్రీడాకారులందరికీ వసతి సౌకర్యాలు కల్పించడమే కాకుండా, జట్ల రాకపోకల కోసం 45 ప్రత్యేక బస్సులు మరియు అధికారుల కోసం ఇతర వాహనాలను సిద్ధం చేస్తామని, క్రీడాకారుల ఆరోగ్య భద్రత దృష్ట్యా ప్రతి గ్రౌండ్ వద్ద ఒక అంబులెన్స్ తో పాటు వైద్య బృందం నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సాంకేతికపరంగా ఈ టోర్నీని పారదర్శకంగా నిర్వహించేందుకు ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ నుండి 40 మంది ప్రతినిధులు మరియు రిఫరీలు హాజరవుతున్నారనీ, మ్యాచ్‌ల సమయంలో తలెత్తే వివాదాల పరిష్కారానికి జ్యూరీ ఆఫ్ అప్పీల్స్ కమిటీని కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రీడా పోటీలకు సంబంధించి ఫిబ్రవరి 5వ తేదీ నుంచే ప్రత్యేక కంట్రోల్ రూమ్ అందుబాటులోకి వస్తుందని, అఖిల భారత స్థాయి పోటీలు రాష్ట్ర ప్రతిష్టను చాటిచెప్పేలా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి శివధర్ రెడ్డి వెల్లడించారు. అడిషనల్ డిజిపి అనిల్ కుమార్, మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, స్పోర్ట్స్ ఐజిపి డాక్టర్ గజరావు భూపాల్, హైదరాబాద్ శాంతిభద్రతల అడిషనల్ సిపి తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సిపి ఎన్.శ్వేత, విజిలెన్స్ డిఐజి అభిషేక్ మహంతి, యూసఫ్ గూడా బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ లో ప్రారంభమైన సమ్మక్క-సారక్క జాతర ఉత్సవాలు

- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్





రంగారెడ్డి జిల్లా ప్రతినిధి జనవరి 28 భారతీయ వెలుగు

ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలను అలవర్చుకోవాలని ప్రజలకు అమ్మవార్ల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.బుధవారం రాజేంద్రనగర్ పరిధిలో సమ్మక్క-సారక్క జాతర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేలను సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ...మేడారం జాతర తరహాలో రాజేంద్రనగర్ లో కూడా వనదేవతలను కొలుస్తూ భక్తులు మొక్కులు చెల్లించుకుంటారని ఇక్కడ స్థానిక గిరిజన సాంప్రదాయాల ప్రకారం పూజలు జరుగుతాయని అన్నారు.మేడారానికి వెళ్లలేని నగరవాసులు రాజేంద్రనగర్ ప్రాంతంలో జరిగే ఈ జాతరలో పాల్గొంటారని ఇలాంటి జాతర తన ప్రాంతాల్లో జరగడం సంతోషకర విషయమని పేర్కొన్నారు.

# అడిషనల్ కలెక్టర్ జి.జితేందర్ రెడ్డి, ఆడిట్ పరిశీలకులుగా నియమితులు

కరీంనగర్ జనవరి 28 భారతీయ వెలుగు



కరీంనగర్ జిల్లా మున్సిపల్ ఎన్నికల పరిశీలకులుగా నియామకమైన హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ జి.జితేందర్ రెడ్డి, ఆడిట్ పరిశీలకులుగా నియమితులైన పెద్దపల్లి జిల్లా ఆడిట్ ఆఫీసర్ ఎం.మనోహర్ లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేలతో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు.

జిల్లాలోని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, చొప్పదండి హుజూరాబాద్ జమ్మికుంట మున్సిపాలిటీ ఎన్నికల నిర్వహణ, పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్య, ఎన్నికలకు ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు.

# రాజశ్యామల యాగం లో పాల్గోన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్ జనవరి 28 భారతీయ వెలుగు

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి లోని



పోతిరెడ్డి పల్లి చౌరస్తా సమీపం లో దత్తగిరి ఆశ్రమం అద్వర్యం లో లోక కల్యాణార్థం నిర్వహించిన శ్రీ రాజ శ్యామల యాగం లో పాల్గోన్నారు . ఈ సందర్భంగా దత్తగిరి ఆశ్రమం పీఠాధిపతి అవధూతగిరి మహారాజ్ గారి నేతృత్వం లో పండితులు , వేద పాఠశాల విద్యార్థులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద పండితులు తమ మంత్రోచ్చారణ తో రాజశ్యామల యాగం ను మంత్రి దామోదర్ రాజనర్సింహ గారిచే నిర్వహించారు .అనంతరం పూర్ణహుతి కార్యక్రమం లో పాల్గోని అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు.

# అజిత్ విమాన ప్రమాదంలో కుట్ర కోణం సుప్రీం పర్యవేక్షనలో దర్యాప్తు జరగాలి

విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్‌పవార్ ప్రాణాలు కోల్పోయిన ఘటనపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. అజిత్ మృతిలో కుట్రకోణం ఉందనే అనుమానం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం దేశంలో రాజకీయ నాయకుల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అజిత్ మృతి చెందిన వార్త తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని మీడియాతో మాట్లాడుతూ మమతా బెనర్జీ అన్నారు. బీజేపీని వీడాలని ఆయన ఆలోచిస్తున్నారని ఇటీవల జరిగిన ప్రచారాన్ని ప్రస్తావిస్తూ, రాజకీయ నాయకులకు సైతం భద్రత లేకుండా పోతోందన్నారు. ఈ ఘటన అనేక ప్రశ్నలకు తావిస్తోందన్నారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో మాత్రమే దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అత్యున్నత న్యాయస్థానం మీద మాత్రమే తమకు నమ్మకం ఉందని, మరో ఇతర దర్యాప్తు సంస్థలపైన
విశ్వాసం లేదని, దర్యాప్తు సంస్థలు తమ స్వేచ్ఛ కోల్పోయాయని ఆరోపించారు. కాగా, బారామతి విమాన ప్రమాదంపై విచారణ జరిపించాలని పలువురు రాజకీయ నేతలు సైతం డిమాండ్ చేశారు. అజిత్ పవార్ మృతికి సంతాపం తెలుపుతూ ఇందుకు దారితీసిన ప్రమాద ఘనటపై పారదర్శకమైన దర్యాప్తు జరపాలని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్, వంచిత్ బహుజన్ అఘాడి నేత ప్రకాష్ అంబేద్కర్ తదితరులు కోరారు.

# కల్తీ నెయ్యిపై జగన్ బుకాయింపు

**నిజనిర్ధారణ జరిగాక కూడా తప్పుదోవ పట్టించే ప్రకటనలు**
**సహచర మంత్రులతో సంభాషణలో లోకేశ్ ఆగ్రహం**

మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మహాపాపం చేసి కూడా బుకాయించు కోవటం జగన్ కే చెల్లిందంటూ వ్యాఖ్యలు చేశారు. కేబినేట్‌కు ముందు ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రులతో లోకేశ్ అల్పాహార విందు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి అంశాన్ని ప్రస్తావించారు. పవిత్రమైన తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందని నిర్ధారణ అయ్యాక కూడా నివేదికను వక్రీకరిస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని జగన్‌పై ఫైర్ అయ్యారు. పాలే లేని కల్తీ నెయ్యిని సృష్టించి దేవుడి ప్రసాదాన్ని అపవిత్రం చేయటం క్షమించరాని నేరమన్నారు. వందలకోట్ల కుంభకోణానికి పాల్పడటమే కాకుండా అసత్యాలతో ప్రజల్ని తప్పుదోవ పట్టించే యత్నం చేస్తున్నారని మంత్రి విమర్శించారు. వైసీపీ కుట్రలను ధీటుగా తిప్పికొట్టడంతో పాటు వారి భాగోతాన్ని ప్రజల్లోనే ఎండగడదామని మంత్రులతో జరిగిన సమావేశంలో నారా లోకేశ్ సూచించారు.-కాగా.. తిరుమల శ్రీవారి ప్రసాదమైన లడ్డూ తయారీలో ఉపయోగించిన కల్తీ నెయ్యి కేసులో సీబీఐ ఆధ్వర్యంలోని సిట్ ఇటీవల తుది ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ చార్జ్‌షీట్‌లో 36 మందిని నిందితులుగా చేర్చింది. వీరిలో 12 మంది టీటీడీ ఉద్యోగులు కూడా ఉన్నారు. 2019 నుంచి 2024 వరకు రూ.235 కోట్ల విలువైన 60 లక్షల కిలోల కల్తీ నెయ్యిని తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి ఉపయోగించారని సిట్ దర్యాప్తులో తేలిన సంగతి తెలిసిందే.

# జంపన్న వాగుగా మారిన సంపెంగ వాగు

**-నదిలో స్నానం ఆచరించడం ఆనవాయితీ**

జంపన్న వాగుకు కేవలం ఆధ్యాత్మిక ప్రాధాన్యత మాత్రమే కాదు, అద్భుతమైన వీరగాథ కూడా ఉంది. ఒకప్పుడు దీనిని సంపెంగ వాగు అని పిలిచేవారు. 13వ శతాబ్దంలో కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడి కాలంలో, గిరిజనులు కరువు కారణంగా కప్పం కట్టలేకపోవడంతో కాకతీయ సైన్యం మేడారంపై దాడి చేసింది. ఆ భీకర యుద్ధంలో సమ్మక్క భర్త పగిడిద్ద రాజు, కుమార్తె సారలమ్మ, అల్లుడు గోవిందరాజులు వీరమరణం పొందారు. తల్లి సమ్మక్కతో కలిసి యుద్ధం చేసిన కుమారుడు జంపన్న తీవ్రంగా గాయపడ్డాడు. శత్రువుల చేతిలో చిక్కడం ఇష్టం లేక, ఆయన ఈ సంపెంగ వాగులోకి దూకి ఆత్మార్పణం చేసుకున్నాడు. జంపన్న చిందించిన రక్తధారల వల్లే వాగు నీరు ఎరుపు రంగులో ఉంటుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. నాటి నుంచి జంపన్న వీరత్వానికి గుర్తుగా ఈ వాగుకు 'జంపన్న వాగు' అనే పేరు స్థిరపడిపోయింది. ప్రస్తుతం జంపన్న వాగు భక్తుల రాకతో సందడిగా ఉంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇక్కడే బస చేస్తూ, వాగు జలాలను పవిత్రంగా భావించి నెత్తిన చల్లుకుంటున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం , అధికారులు జంపన్న వాగు వద్ద గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. స్నాన ఘట్టాల వద్ద ప్రమాదాలు జరగకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజులు గద్దెలపైకి చేరుకునే సమయం కావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది.

# అధికార పార్టీకి ఓటు వేద్దాం.. అభివృద్ధికి బాటలేద్దాం..

**మున్సిపల్ మరియు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేద్దాం...**




హైదరాబాద్ జనవరి 28 భారతీయ వెలుగు

తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి గారి ఆధ్వర్యంలో.. నేడు ఇందిరా భవన్ లో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించడం...అనంతరం చీూదీ పైనలిబ్రౌచర్ విడుదల చేసి మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది.జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ పాత్ర, ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను,అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లడం మరియు ఓట్ చోరీ, జాతీయ ఉపాధి హామీ చట్టం పథకంలో మహాత్మా గాంధీ గారి పేరును మార్చే విధంగా బిజెపి మోడీ సర్కార్ చేస్తున్న కుట్రను ప్రజలకు తెలియజేయాల్సిందిగా కోరుతూ... దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న మద్దతు' లివిత్ ఐవైసి యాప్ మరియు పలు అంశాలపై దిశా నిర్దేశం చేయడం జరిగింద ని అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ కో- ఇంచార్జ్ లు రోష్ని జైస్వాల్ కె.ఆర్ భవ్య మరియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు, కార్యదర్శిలు, జిల్లాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు...

TGTEL/26/A0320
భారతీయ వెలుగు
జాతీయ తెలుగు దిన పత్రిక
గురువారం జనవరి 29, 2026



# నిజంగా నేను నటించగలనా

"'ది రాయల్స్' సిరీస్‌ను ప్రేక్షకులు చూడటం సంతోషంగా ఉన్నప్పటికీ.. దాని గురించి వచ్చిన విమర్శలు నన్ను కదిలించాయి" అని అంటోంది బాలీవుడ్ కథానాయిక భూమి పెడ్నేకర్. వైవిధ్యమైన పాత్రలతో వెండితెరపై మెరుస్తూనే.. థ్రిల్ పంచే సిరీస్‌లతో ఓటీటీ వేదికగా కూడా సత్తా చాటుతోంది. భూమి ప్రధాన పాత్రలో నటించిన సిరీస్ 'దల్దాల్'. ఈ క్రైమ్ థ్రిల్లర్‌లో డీసీపీ రీటా పాత్రలో నిందితుల్ని పరుగులు పెట్టించడానికి సన్నద్ధమవుతోంది. ఈ సిరీస్ ఈ నెల 30న రానుంది. ఈ నేపథ్యంలోనే రాబోయే సిరీస్, తనపై వచ్చిన విమర్శల గురించి కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకొంది భూమి.

"దల్దాల్' అనేది ఒక క్రైమ్ థ్రిల్లర్. ఇందులో నేను యాంటీ హీరోగా కనిపిస్తా. అధిక ప్రాధాన్యత ఉన్న ఈ పాత్రలో నటించేందుకు చాలా థ్రిల్‌గా ఫీల్ అయ్యాను. ఇలా మహిళలే కేంద్రంగా చేసుకొని మరిన్ని కథలు రావాలని కోరుకుంటున్నా. నేను ఎంచుకునే ప్రతి పాత్రలోనూ నా ప్రాణం పెట్టి పని చేస్తా. ఇందులో నటించడం ఎంత సంతోషంగా ఉందో అన్ని సవాళ్లను కూడా ఎదుర్కొన్నాను".

### ఏ షూటింగ్‌కు వెళ్లలేదు

"గతేడాది నేను నటించిన 'ది రాయల్స్' సిరీస్‌పై ఎన్నో విమర్శలు వచ్చాయి. అవన్నీ నన్ను చాలా నిరుత్సాహపరిచాయి. మానసికంగా అలసిపోయాను. ఆ ఎదురుదెబ్బతో.. ఒక నటిగా, వ్యక్తిగా నేను ఎవరో అనే దానిపై అవగాహనను పూర్తిగా కోల్పోయా. అందుకే నేను వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఆ విమర్శలు.. నన్ను సినిమా సెట్ నుంచి దాదాపు తొమ్మిది నెలల పాటు దూరంగా ఉండేలా చేశాయి. జూన్ నుంచి ఏ షూటింగ్‌కు వెళ్లలేదు. వృత్తిపరంగా, వ్యక్తిగతంగా ఎన్నో ప్రశ్నల్ని ఎదుర్కొన్నాను".

### నాలో ప్రతిభ ఉందా

"నా నటనకు ఉపయోగపడే నిజమైన అనుభవం నాలో ఏమీ మిగల్లేదు అనిపించింది. అది నన్ను ఇంకా భయపెట్టింది. నాకు ఎప్పుడూ ఒక భయం ఉంటుంది. అదేంటంటే.. నేను ఎప్పుడూ ఒక సాధారణ నటిగా మిగిలిపోకూడదని అనుకుంటా. ఆ స్థాయికి కూడా చేరుకున్నా. కానీ వాస్తవాల్ని, విమర్శల్ని అంగీకరించడం ముఖ్యం. అయినా నేను ఏం చేయగలనో నాకు తెలుసు. 'ది రాయల్స్'పై వచ్చిన ట్రోలింగ్స్ వల్ల అయోమయంలో పడ్డాను. దాంతో నా పాత సినిమాలను తిరిగి చూశా. నేను నిజంగా నటించగలనా నాలో ఆ ప్రతిభ ఉందా అని నన్ను నేను ప్రశ్నించుకున్నా. అంతగా ఆ విమర్శలు నన్ను కదిలించాయి".

### అన్నింటికీ దూరమైనా..

"నేనెప్పుడూ సినిమాల నుంచి ఇంత విరామం తీసుకోలేదు. చిత్రీకరణల నుంచి దూరంగా ఉన్నప్పుడు అడ్వాన్స్‌గా తీసుకున్న డబ్బును కూడా తిరిగి ఇవ్వాల్సి వచ్చింది. ఇది కేవలం సినిమాలను తిరస్కరించడం మాత్రమే కాదు.. మీడియాలో నా ఉనికిని తగ్గించుకోవడం. నేను అవార్డు కార్యక్రమాలు, ఫ్యాషన్ ఈవెంట్‌లకు కూడా హాజరు కానని చెప్పా. ఇలా నేను అన్నింటికీ దూరమైనా కూడా నా సొంతంగా నేను బతకగలనో లేదో తెలుసుకున్నా. విరామ సమయాల్లో ఖాళీగా లేను. పుస్తకాలు చదవడం, సినిమాలు చూడటం ప్రయాణించడం లాంటివి చేశా"

## అల్లు అర్జున్, లోకేశ్ మూవీకి సోషల్ మీడియాలో ట్రెండ్

అల్లు అర్జున్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా




రానున్న విషయం తెలిసిందే. ఎఎ23గా ఇది ప్రచారంలో ఉంది. ఇంకా షూటింగ్ కూడా ప్రారంభం కాని ఈ సినిమా అప్పుడే సోషల్ మీడియాలో రికార్డును సొంతం చేసుకుంది. ఇటీవల ఈ సినిమాను అధికారికంగా ప్రకటిస్తూ.. ఓ థీమ్ సాంగ్ విడుదల చేశారు. ఇప్పుడది సోషల్ మీడియాలో ట్రెండ్ క్రియేట్ చేస్తోంది. ఏకంగా ఈ థీమ్ సాంగ్‌పై ఇన్‌స్టాలో 3,55,000 రీల్స్ క్రియేట్ అయ్యాయి. కొన్ని రోజులుగా ట్రెండ్ అవుతోన్న 'ఎనిబిసనీటబీఞ। ఓ÷ూబ।'÷బి వీడియోకు ఈ సాంగ్‌ను ఉపయోగిస్తున్నారు. దీంతో 13 రోజుల్లోనే లక్షల రీల్స్ ఈ పాటతో క్రియేట్ అయ్యాయి. అత్యధిక రీల్స్ పొందిన థీమ్ సాంగ్‌గా ఈ పాట రికార్డు నెలకొల్పింది. ఇప్పటికీ టాప్‌లో కొనసాగుతోంది. ఈ ఏడాదిలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. ఇక అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో ఓ చిత్రంలో నటిస్తున్నారు. భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ మూవీలో దీపికా పదుకొణె కథానాయికగా కనిపించనున్నారు. సైన్స్ ఫిక్షన్ జానర్‌లో దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా అట్లీ దీని గురించి మాట్లాడుతూ.. అద్భుతమైన అవుట్‌పుట్ కోసం నిద్ర లేని రాత్రులు గడుపుతున్నట్లు చెప్పారు. అభిమానులకు అదిరిపోయే సర్‌ప్రైజ్‌ను సిద్ధం చేస్తున్నామని తెలిపారు.




## బోర్డర్-3ని అనౌన్స్ చేసిన టీ సీరిస్

సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో నటించిన 'బోర్డర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లతో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. రిపబ్లిక్ డే కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం కేవలం ఐదు రోజుల్లోనే రూ.200 కోట్ల మార్కును అందుకుంది. అయితే ఈ సినిమా సాధించిన భారీ విజయాన్ని పురస్కరించుకుని తాజాగా చిత్ర నిర్మాతలు 'బోర్డర్ 3' గురించి అధికారిక ప్రకటన చేశారు. టీ-సిరీస్ అధినేత భూషణ్ కుమార్ మరియు జేపీ ఫిల్మ్స్ నుంచి నిధి దత్తా కలిసి ఈ ఐకానిక్ ఫ్రాంచైజీని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు చేతులు కలిపారు. ప్రస్తుతం థియేటర్లలో సన్నీడియోల్, వరుణ్ ధావన్, దిల్జిత్ దోసాంజ్ వంటి స్టార్లతో అలరిస్తున్న 'బోర్డర్ 2' ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే రూ.200 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి బ్లాక్ బస్టర్ దిశగా దూసుకుపోతోంది. ఈ ఓపెనింగ్ వీకెండ్ సక్సెస్ ఇచ్చిన ధీమాతోనే 'బోర్డర్ 3' ప్రాజెక్టును పట్టాలెక్కించడానికి నిర్మాతలు సిద్ధమయ్యారు. ఈ మూడవ భాగంలో కూడా సన్నీ డియోల్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారని సమాచారం ఉండగా.. మిగిలిన నటీనటులు మరియు సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు. దాదాపు ముప్పై ఏళ్ల తర్వాత మళ్లీ అదే దేశభక్తిని వెండితెరపై ఆవిష్కరించి, ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణ పొందుతున్నామని, అందుకే ఈ స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని 'బోర్డర్ 3'తో కొనసాగిస్తున్నామని నిర్మాతలు సగర్వంగా ప్రకటించారు.




## సెట్‌లో మమ్ముట్టికి సన్మానం

మలయాళ మెగాస్టార్ మమ్ముట్టికి కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. దాదాపు 40 ఏండ్లుగా సినిమా రంగంలో అతడు అందిస్తున్న సేవలకు గాను ఈ అవార్డును కేంద్రప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ శుభసందర్భంగా ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'పాదయాత్ర' సినిమా షూటింగ్ సెట్స్‌లో చిత్ర బృందం మమ్ముట్టిని ఘనంగా సన్మానించింది. భారత ప్రభుత్వం 2026 గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశంలోనే మూడవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్‌ను ఆయనకు ప్రకటించడంతో సెట్స్‌లో పండుగ వాతావరణం నెలకొంది. లెజెండరీ దర్శకుడు అడూర్ గోపాలకృష్ణన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం సెట్స్‌లో యూనిట్ సభ్యులందరూ కలిసి మమ్ముట్టిని సత్కరించి తమ సంతోషాన్ని పంచుకున్నారు. దాదాపు 32 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మమ్ముట్టి మరియు అడూర్ గోపాలకృష్ణన్ కాంబినేషన్‌లో సినిమా వస్తుండటం, అదే సమయంలో ఈ గౌరవం దక్కడం విశేషం. గతంలో 1998లో పద్మశ్రీ, 2022లో కేరళ ప్రభ పురస్కారాలు అందుకున్న మమ్ముట్టి ఇప్పుడు పద్మభూషణ్ గ్రహీతగా నిలిచారు.




## సుహాస్ మరో కామెడీ మూవీ హే భగవాన్

'కలర్ ఫోటో', 'రైటర్ పద్మభూషణ్' వంటి సినిమాలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సుహాస్, ఇప్పుడు 'హే భగవాన్'తో మరోసారి నవ్వించడానికి సిద్ధమయ్యారు. గోపి అచంట దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి 'రైటర్ పద్మభూషణ్' ఫేమ్ షణ్ముఖ ప్రశాంత్ కథను అందించగా, వివేక్ సాగర్ సంగీతాన్ని సమకూర్చారు. వెన్నెల కిషోర్, సుదర్శన్, అన్నపూర్ణమ్మ వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా, త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బ్యానర్‌పై బి. నరేంద్ర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తండ్రీకొడుకుల మధ్య ఉండే ఎమోషన్‌తో పాటు ఆద్యంతం వినోదాన్ని పంచే ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 20న విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసింది. ఒక రహస్యమైన 'ఫ్యామిలీ బిజినెస్' చుట్టూ తిరిగే ఈ కథలో ఆ వ్యాపారం ఏంటో ఎవరికీ చెప్పకూడదనే ఆసక్తికర నిబంధనతో సాగే తండ్రీకొడుకుల ప్రయాణం హిలేరియస్‌గా ఉండబోతోందని టీజర్ చూస్తే అర్థమవుతోంది. 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండు' తర్వాత సుహాస్ మరియు శివాని నాగరం ఈ చిత్రంతో మరోసారి జంటగా నటిస్తున్నారు. ఎలాగైనా నాన్న బిజినెస్‌ను తాను టేకప్ చేయాలని తాపత్రయ పడే పాత్రలో సుహాస్ నవ్వులు పూయిస్తున్నారు. 'ఎంతో మంది ఇళ్లలో దీపాలు వెలిగించాడండీ..' అనే డైలాగులతో పాటు శివాని నాగరం జోక్స్ ఆకట్టుకుంటున్నాయి.

## పెళ్లి చూపుల నుంచి నేటి వరకు ఒత్తిడి తట్టుకుంటూనే ఉన్నా: తరుణ్ భాస్కర్



తెలుగు సినీ పరిశ్రమలో వైవిధ్యమైన సినిమాలతో అలరిస్తున్నవారిలో తరుణ్ భాస్కర్ ఒకరు. తన ప్రత్యేక కథా శైలి, వినూత్న ప్రయత్నాలతో ఆయనను 'స్టోరీ మేకర్'గా గుర్తిస్తారు. తాజాగా ఆయన దర్శకత్వంలో రూపొందిన 'ఓం శాంతి శాంతి శాంతిః' జనవరి 30న థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా తరుణ్ భాస్కర్ మీడియాతో తన ప్రయాణాన్ని పంచుకున్నారు. తరుణ్ తన కెరీర్ మొదటి సినిమాగా వచ్చిన 'పెళ్లి చూపులు' విజయాన్ని గుర్తు చేసుకుంటూ, 'ఆ విజయం నా కోసం ఎక్కువ ఒత్తిడిని తెచ్చింది' అని చెప్పారు. ఆ సమయంలో ఆయనకు ఎదురైన భయాలు, ఆందోళనలు, విజయంతో పాటు వచ్చిన బాధ్యతలన్నీ మామూలు అనుభవం కాదని అన్నారు. సినిమా రిలీజ్ సమయంలో హార్ట్ ఎటాక్ వచ్చినంత పనైందని స్పష్టం చేశాడు. విజయాన్ని సులభంగా స్వీకరించడం, అపజయాన్ని అధిగమించడం నిజమైన విద్య అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సినిమాలో హీరోయిన్ గా ఈషా రెబ్బ నటించగా, యూత్ ఫుల్ ఎలిమెంట్స్, హ్యూమర్, సెంటిమెంట్ అన్నీ తగినంత మేళవించ బడ్డాయని తెలిసింది. తరుణ్ తన ప్రత్యేకమైన శైలిలో కథను రాసి, ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నారని నిర్మాతలు తెలిపారు. కేవలం దర్శకుడిగా కాకుండా, నటుడిగా కూడా తన మార్క్ సినిమాలను కొనసాగిస్తూ, ప్రతి సినిమాతో లోకల్ కల్చర్ ను విశేషంగా ప్రతిబింబించాలను కుంటున్నారని ఆయన చెప్పినారు. తరుణ్ భాస్కర్ ఈ ప్రయాణంలో ఒక బలమైన పాఠాన్ని అందించారు. విజయం వచ్చినా, విఫలం అయినా, దానిని తట్టుకోవడమే నిజమైన గెలుపు. 'పెళ్లి చూపులు' నాటి ఆందోళనల నుండి నేడు 'ఓం శాంతి శాంతి శాంతిః' వరకు ఆయన నిరంతర కృషి, క్రియేటివిటీ, ధైర్యం యువ దర్శకులకు మార్గదర్శకం. జనవరి 30న విడుదలయ్యే ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

Publishers Gunnala lavanya Printers VASISTA PRINTERS Pothuganti Rajanna, 18-97#306, 3rd Floor, Rajini gandha Complex , kamala Nagar, Chaitanyapuri, Rangareddy, Telangana, 500060 Aditar Gunnala Anilreddy Phone 9642844456, 9705043131